## గగనంలో 'స్మైలీ ఫేస్' అద్భుతం..!



2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - ఆదివారం 20 ఏప్రిల్ 2025 | సంపుటి:9 | సంచిక:114 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA| HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |

## మే2న కేదార్‌నాథ్ ఆలయ ప్రవేశం



భద్రతకు ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ థామ్ భరోసా

2



# మెగా డీఎస్సీకి కూటమి నోటిఫికేషన్

## జారీ చేయనున్నట్లు మంత్రి నారా వెల్లడి

**ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగార్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న డీఎస్సీ షెడ్యూల్ విడుదలైంది. గతంలో ప్రకటించినట్లే మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ ఏప్రిల్ 20న నోటిఫికేషన్ జారీ చేయనున్నట్టు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఏప్రిల్ 20 నుంచి మే 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. జూన్ 6 నుంచి జులై 6 వరకు సీబీటీ విధానంలో డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నట్టు షెడ్యూల్‌లో పేర్కొన్నారు.**

## టీటీడీ సంచలన నిర్ణయం..

# అన్యమత ఉద్యోగిపై వేటు



**తిరుమల:** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అన్యమత ప్రచారం చేస్తున్న ఉద్యోగిపై చర్యలు తీసుకుంది. పద్మావతి మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ ఆసుంతా అన్యమతం ప్రచారం, పలు అక్రమాలకు పాల్పడినట్లు ఈవోకు సహచర ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు టీటీడీ అధికారులు ఆసుంతాపై వేటు వేశారు. ఆసుంతాను ఆయుర్వేదిక్ ఫార్మసీకి బదిలీ చేస్తూ డీఈవో విజయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు.టీటీడీలో పనిచేసే ఉద్యోగులు హిందూ సంప్రదాయాలకు అనుగుణంగా పనిచేయాల్సి ఉంటుంది. టీటీడీలో చేరే ముందే ఉద్యోగులకు అన్యమత ప్రచారంపై స్పష్టంగా చెబుతారు. కానీ కొంతమంది అధికారులు మాత్రం ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాలను తుంగలో తొక్కుతున్నారు. ఉద్యోగులు చేస్తున్న తప్పిదాలతో తిరుమల దేవస్థానం ఇలాంటి వివాదాల్లో నిలుస్తోంది. ఇప్పటికే టీటీడీలో అన్యమత ఉద్యోగులను తొలగించాలని పలువురు భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవడంతో భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై మరింత సమగ్ర దర్యాప్తు జరుపుతున్నామని అవసరమైతే తదుపరి చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని టీటీడీ అధికారులు స్పష్టం చేశారు.

## వైకాపా హయాంలో 'పుర' నిధులు దారిమళ్లించారు: మంత్రి నిమ్మల

**పాలకొల్లు:** వైకాపా హయాంలో పురపాలక నిధులు దారిమళ్లించారని మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపించారు. తాము బడ్జెట్‌లో పట్టణాలకు రూ.13,862 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో పలు అభివద్ధి పనులకు శనివారం మంత్రి శంకుస్థాపన చేశారు. ''కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అభివద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. ఆర్థిక స్థితి బాగాలేకున్నా అభివద్ధి, సంక్షేమం లక్ష్యంగా సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారు. ముఖ్యమంత్రి పాలనాదక్షతను ఆర్థిక సంఘం ప్రతినిధులూ ప్రశంసించారు'' అని మంత్రి నిమ్మల తెలిపారు.





## మిథున్‌రెడ్డిని 8 గంటలపాటు విచారించిన సిట్

**విజయవాడ:** మద్యం కుంభకోణం కేసులో వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డిపై సిట్ అధికారుల విచారణ శనివారం ముగిసింది. ఇవాళ ఉదయం విజయవాడ సిట్ కార్యాలయానికి చేరుకున్న ఆయన్ను దాదాపు 8 గంటల పాటు సిట్ బందం విచారించింది. ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసి సంతకాలు తీసుకుంది. వివిధ అంశాలపై ఆరా తీసిన అధికారులు కీలక సమాచారాన్ని రాబట్టినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై మరోసారి ఆయన్ను పిలిచే అవకాశముంది.

కోర్టు ఉత్తర్వుల మేరకు న్యాయవాది సమక్షంలో మిథున్‌రెడ్డిని విచారించారు. మద్యం పాలసీ రూపకల్పన, మిథున్‌రెడ్డి ప్రమేయం, డిస్టిలరీ నుంచి ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మద్యం కొనుగోళ్లపై సుదీర్ఘంగా ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. రాజ్ కసిరెడ్డికి చెందిన ఆడాన్ డిస్టిలరీ, డికార్ట్ నుంచి ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎంతమేర కొనుగోళ్లు చేసిందని ప్రశ్నించినట్లు సమాచారం.

## చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు వైభవంగా నిర్వహిస్తాం: మంత్రి ఆనం



**అమరావతి:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు 75వ పుట్టినరోజు (ఏప్రిల్ 20) వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. నాయకులంతా వారి ప్రాంతాల్లోని ఆలయాల్లో పూజలు నిర్వహించాలని కోరారు. చంద్రబాబు నిండు నూరేళ్లు ఆనందంగా ఉండాలని కోరుకోవాలన్నారు. అన్ని మతాల వారు తెదేపా కార్యకర్తలు, నేతలుగా ఉన్నారన్న ఆయన.. మసీదులు, చర్చిల్లోనూ ప్రార్థనలు చేయాలని పిలుపునిచ్చారు. దేశ ఔన్నత్యాన్ని చాటుతూ చంద్రబాబు కోసం పూజలు, ప్రార్థనలు చేయాలన్నారు. చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం ఆత్మకూరులో పెద్ద ఎత్తున మెం చేయబోతున్నట్లు మంత్రి తెలిపారు.

## గత ప్రభుత్వానికి చెత్తపన్నుపై ఉన్న శ్రద్ధ పారిశుద్ధ్యంపై లేదు: మంత్రి నారాయణ

**నెల్లూరు:** ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ నిర్వహించుకుందామని మంత్రి నారాయణ తెలిపారు. స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్‌లో భాగంగా నెల్లూరులో వేలాది మందితో ర్యాలీ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలోనే అత్యంత శుభ్రమైన రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమని తెలిపారు. ఆలోచనలు, పరిసరాలు, ఇల్లు అన్నీ పరిశుభ్రంగా ఉంటేనే అంతా స్వచ్ఛంగా ఉంటుందని చెప్పారు. ''ప్రజలందరి భాగస్వామ్యంతో స్వచ్ఛ దివస్ నిర్వహిస్తున్నాం. గత ప్రభుత్వంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త దర్శనమిచ్చేది. ఆ ప్రభుత్వం కూడా చెత్త ప్రభుత్వంగా పేరు తెచ్చుకుంది. జగన్ సర్కార్ చెత్తపన్నుపై పెట్టిన శ్రద్ధ పారిశుద్ధ్యంపై పెట్టలేదు. మున్సిపాలిటీ

...మిగతా 2లో



## నెగ్గిన అవిశ్వాస తీర్మానం..

## జీవీఎంసీ మేయర్ పీఠం కూటమిదే



**విశాఖ:** మహా విశాఖ నగర పాలక సంస్థ మేయర్ గొలగాని హరి వెంకట కుమారిపై 'కూటమి' ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఈ ఉదయం 11 గంటలకు జీవీఎంసీ ఇన్‌ఛార్జ్ కమిషనర్, కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం ప్రారంభమైంది. వైకాపా కార్పొరేటర్లు ఒక్కొక్కరిగా పార్టీని వీడడంతో 'కూటమి' బలం పెరిగింది. జీవీఎంసీలో మొత్తం 97 మంది సభ్యులు ఉన్నారు. సమావేశానికి ఎక్స్‌అఫీషియో సభ్యులతో కలిపి 74 మంది కూటమి సభ్యులు హాజరయ్యారు. వీరంతా

...మిగతా 2లో

## పూసపాటిరేగ పోలీస్ స్టేషన్లో శ్రీరెడ్డి

**విజయవాడ:** సోషల్ మీడియాలో బరితెగించి వీడియోలు పెట్టిన శ్రీరెడ్డి ఇవాళ పోలీస్ స్టేషన్ మెట్లెక్కింది. విజయనగరం జిల్లా పూసపాటిరేగ పోలీస్ స్టేషన్‌లో ఆమె విచారణకు హాజరైంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ పై అసభ్యకర పోస్టులు పెట్టిందన్న ఫిర్యాదు మేరకు నెల్లిమర్ల పోలీస్ స్టేషన్లో నమోదైన కేసు నేపథ్యంలో ఇవాళ శ్రీరెడ్డి పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. శ్రీరెడ్డిని సిఐ రామకష్ణ విచారించారు. 41ఏ కింద నోటీసులు ఇచ్చి శ్రీరెడ్డిని పంపించారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు శ్రీరెడ్డి తన ఇష్టానికి వీడియోలు పెట్టి విపక్ష నేతలను బండబూతులు తిట్టిన సంగతి తెలిసిందే. అయితే, 2024 ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయి టీడీపీ - జనసేన అధికారంలోకి రావడంతో నీతివాక్కులు పలకడం మొదలుపెట్టింది శ్రీరెడ్డి. అయితే, ఆమెను టీడీపీ అధికారంలోకి వచ్చిన నెలలోపే లోపలేస్తారని అంతా భావించారు. అయితే, దానికి పూర్తి విరుద్ధంగా అధికార టీడీపీ, జనసేన అధినేతలు మహిళ అనో.. మరొకటో కాని శ్రీరెడ్డిపై ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలకు దిగకపోవడం ఆసక్తిదాయకం.ఇలా ఉండగా, శ్రీరెడ్డి మీద పలు పోలీస్ స్టేషన్లలో టీడీపీ, జనసేన శ్రేణులు కేసులు దాఖలు చేసిన

...మిగతా 2లో

## గుడ్ న్యూస్.. ఆ ఉత్తర్వులు జారీ చేసిన చంద్రబాబు సర్కార్..

**అమరావతి:** ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకారులకు 3 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు మార్గదర్శకాలను జారీ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఏపీ క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. క్రీడాకారుల భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పోర్ట్ కోటాను 2 నుంచి 3 శాతానికి పెంచారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. క్రీడాకారుల అభివద్ధికి నిస్వార్థంగా పాటుపడుతున్న సీఎం చంద్రబాబు,

...మిగతా 2లో

# భారత్ రానున్న ఎలాన్ మస్క్

**అనేక సార్లు వాయిదా పడిన పర్యటన • ప్రధాని మోడీ, ఎలాన్ రెండుసార్లు భేటి**

**• భారత్‌కు బిలియన్ డాలర్ల పెట్టుబడి • పర్యటన ఖరారును ప్రకటించిన ఎలాన్ మస్క్**



**వాషింగ్టన్, ఏప్రిల్ 19:** టెక్ ప్రపంచ దిగ్గజం,టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ఎట్టకేలకు భారత పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అనేక సార్లు వాయిదా పడిన మస్క్ పర్యటన ఈసారి ఖరారు కానున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని స్వయంగా మస్క్ ప్రకటించడం విశేషం. ప్రపంచంలోనే అత్యంత టెక్ బిలియనీర్లలో ఒకరైన ఎలాన్ మస్క్, ఈ ఏడాది చివర్లో భారత పర్యటనకు రానున్నట్లు ప్రకటించారు. ఈ పర్యటన, ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో జరిగిన ఫోన్ సంభాషణ తర్వాత తెలుపడం విశేషం. ఇది అమెరికా, భారత్ మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే విషయంలో కీలకం కానుంది. టెస్లాలో పనిభారం కారణంగా భారతదేశ పర్యటన ఆలస్యం అయిందన్నారు. కానీ ఈ సంవత్సరం చివర్లో జరిగే పర్యటన కోసం తాను చాలా ఆసక్తిగా ఎదురు

...మిగతా 2లో

## విజయసాయి రెడ్డి చరిత్ర బయటపెడతా: రాజ్ కసిరెడ్డి

**అమరావతి:** మద్యం కుంభకోణం కేసులో కొన్నాళ్లుగా తనపై అసత్య ప్రచారం జరుగుతోందని రాజ్ కసిరెడ్డి అన్నారు. తాను లేనప్పుడు సిట్ అధికారులు ఆఫీసుకు, ఇంటికి వచ్చి నోటీసులు ఇచ్చారన్నారు. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తనపై చేసిన ఆరోపణలపై త్వరలోనే మీడియా ముందుకు వచ్చి వివరాలు వెల్లడిస్తానని చెప్పారు. ఈ మేరకు ఆయన ఓ ఆడియోను విడుదల చేశారు.''మద్యం స్కామ్‌లో సిట్ రెండుసార్లు నోటీసులు ఇచ్చింది. దీనిపై న్యాయస్థానానికి వెళ్లాను. నిర్ణీత సమయం ఇచ్చి నోటీసులు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. న్యాయరక్షణ కోసం సుప్రీంకోర్టులో పిటిషన్ వేశాను. సుప్రీంకోర్టు ఉత్తర్వుల కోసం నిరీక్షిస్తున్నాను. మద్యం కుంభకోణంతో నాకు ఎలాంటి సంబంధం లేదు. నాపై విజయసాయిరెడ్డి ఆరోపణలు చేశారు. నా న్యాయపోరాటం పూర్తయిన తర్వాత మీడియాను పిలిపించి.. ఆయన చరిత్ర బయటపెడతా'' అని రాజ్ కసిరెడ్డి ఆడియోలో పేర్కొన్నారు.



# గత ప్రభుత్వానికి చెత్తపన్నుపై ఉన్న శ్రద్ధ పారిశుద్ధ్యంపై లేదు: మంత్రి నారాయణ

(మొదటి పేజీ తరువాయి)

నిధులను కూడా దారి మళ్లించారు. పన్నుల ద్వారా వచ్చే మొత్తాన్ని మున్సిపాలిటీల అభివద్ధికే వెచ్చించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. 123 మున్సిపాలిటీలు స్వచ్ఛతలో దూసుకెళ్తున్నాయి'' అని నారాయణ తెలిపారు.

అంతకు ముందు నెల్లూరులోని వీఆర్సీ సెంటర్ నుంచి నర్తకీ సెంటర్ వరకు వేలాది మందితో ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర నినాదాలతో ట్రంక్ రోడ్డు రెత్తింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ, ఎన్టీఆర్ విగ్రహాలకు నారాయణ పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

# గుడ్ న్యూస్.. ఆ ఉత్తర్వులు జారీ చేసిన చంద్రబాబు సర్కార్..



(మొదటి పేజీ తరువాయి)

మంత్రి నారా లోకేశ్‌కు మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి హదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ ఉత్తర్వులతో ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, పోలీస్, ఎక్సైజ్, అటవీ శాఖలతో సహా యూనిఫార్మ్ సర్వీసుల్లో పోటీ పరీక్షలకు నేరుగా నియామక అవకాశాలు లభించనున్నట్లు వెల్లడించారు. మొత్తం 65 క్రీడా విభాగాలు ఈ ప్రత్యక్ష నియామకాల్లో భాగస్వామ్యం అవుతాయని మంత్రి పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ ప్రోత్సాహంతో క్రీడాకారులకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని అన్నారు. క్రీడాకారులకు మంచి భవిష్యత్తే తమ ధ్యేయమని, క్రీడల అభివద్ధికి ప్రణాళికాబద్ధంగా కషి చేస్తున్నట్లు మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి చెప్పుకొచ్చారు.

క్రీడల అభివద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉందని శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు తెలిపారు. స్పోర్ట్స్ పాలసీలో పొందుపరిచిన స్పోర్ట్స్ కోటాను 2 నుంచి 3 శాతానికి పెంచుతూ చంద్రబాబు సర్కార్ జీవో జారీ చేయడం శుభపరిణామం అని చెప్పుకొచ్చారు. క్రీడలు, క్రీడాకారుల అభివద్ధి పట్ల సీఎం చంద్రబాబు మరోసారి తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని కొనియాడారు. జీవో జారీ చేయడంపై క్రీడాకారులంతా సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నట్లు రవినాయుడు పేర్కొన్నారు. క్రీడాకారుల తరుపున సీఎం చంద్రబాబుకు ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు శాప్ ఛైర్మన్ రవినాయుడు తెలిపారు. కాగా, ఉద్యోగ్యాల్లో స్పోర్ట్ కోటాను 2 నుంచి 3 శాతానికి పెంచాలని సీఎం చంద్రబాబు సర్కార్ గతేడాది నిర్ణయించిన సంగతి తెలిసిందే.

# పూసపాటిరేగ పోలీస్ స్టేషన్లో శ్రీరెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

సంగతి తెలిసిందే. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులపై అనుచిత పోస్టులు పెట్టిన వ్యవహారంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 6 కేసులలో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ శ్రీరెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై ఫిబ్రవరి 24న హైకోర్టు విచారణ జరిపింది.

అయితే, చిత్తూరు వన్‌టౌన్ ఠాణా పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు అన్నీ బెయిలబుల్ స్వభావం ఉండటంతో శ్రీరెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌కు విచారణార్హత లేదని స్పష్టం చేస్తూ వ్యాజ్యాన్ని కొట్టివేసింది హైకోర్టు.

ఇక, విశాఖ పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేసిన కోర్టు.. పలు షరతులు విధించింది. రూ.10 వేలతో 2 పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది.

అలాగే కర్నూలు టూటౌన్, కష్ణా జిల్లా గుడివాడ వన్‌టౌన్, విజయనగరం జిల్లా నెలిమర్ల ఠాణాలో నమోదైన కేసులలో పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు అన్నీ ఏడేళ్ల లోపు శిక్షకు వీలున్నవేనని తెలిపింది. ఈ కేసుకు సంబంధించే శ్రీరెడ్డి ఇవాళ నెల్లిమర్ల పోలీస్ స్టేషన్లో విచారణకు హాజరైంది.

# పవన్ కల్యాణ్ ఫొటోలు మార్ఫింగ్.. పోలీసుల చేతికి నిందితుడు..

**పశ్చిమ గోదావరి:** ఆంధ్రప్రదేశ్‌లో సోషల్ మీడియా వేదికగా విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై చంద్రబాబు సర్కార్ ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. తన, మన అనే బేధాలు లేకుండా రాజకీయ నాయకులు, మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఇలాంటి వారిపై ఇప్పటికే పలు కేసులు నమోదు చేసి జైలుకు సైతం తరలించారు. తాజాగా అలాంటి ఘటనే పశ్చిమ గోదావరి జిల్లాలో చోటు చేసుకుంది.ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటోలను మార్ఫింగ్ చేసిన వ్యక్తిని భీమవరం పోలీసులు అరెస్టు చేశారు. పవన్ కల్యాణ్?ను కించపరిచేలా ఆయన మార్ఫింగ్ ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేసిన నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. జనసేన అధినేత, తమ అభిమాన నేతైన పవన్ కల్యాణ్‌ను అవమానించారంటూ హర్షవర్ధన్ అనే వ్యక్తి ఫిబ్రవరి 19న భీమవరం వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫొటోలు మార్ఫింగ్ చేసి తమ మనోభావాలు దెబ్బతీశారంటూ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం సెతేరి గ్రామానికి చెందిన చింతలపూడి పవన్ కుమార్ అలియాస్ ప్రేమ్‌ను నిందితుడిగా గుర్తించినట్లు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. ఉద్దేశపూర్వకంగానే మార్ఫింగ్ చేసిన ఫొటోలను నిందితుడు తన ట్విటర్(ఎక్స్) ఖాతాలో పోస్టు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు నోటీసులు అందించి అనంతరం అతడిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. సామాజిక మాధ్యమాల ద్వారా రాజకీయ ప్రముఖులు, మహిళలు, ఇతర వ్యక్తులను కించపరిచేలా పోస్టులు పెడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అద్నాన్ హెచ్చరించారు.

కాగా, గతంలోనూ డిప్యూటీ సీఎం ఫొటోలను కొంతమంది మార్ఫింగ్ చేశారు. ఉత్తర్ ప్రదేశ్‌లో జరిగిన మహాకుంభమేళాలో పవన్ పుణ్యస్నానాలు ఆచరించారు. ఆ ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేయగా కొంతమంది వాటిని అవమానకర రీతిలో మార్ఫింగ్ చేశారు. అనంతరం వాటిని సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా కేసులు నమోదు అయ్యాయి. మరోవైపు పవన్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ పైనా ఇటీవల అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో కర్నూలు జిల్లాకు చెందిన రఘు అలియాస్ పుష్పరాజ్‌ను నిందితుడిగా గుర్తించారు. ఈ మేరకు గుంటూరు జిల్లా పోలీసులు అతడిని అరెస్టు చేశారు.

# నెగ్గిన అవిశ్వాస తీర్మానం.. జీవీఎంసీ మేయర్ పీఠం కూటమిదే

(మొదటి పేజీ తరువాయి)



అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా ఓటు వేయగా.. కౌన్సిల్ సమావేశాన్ని వైకాపా సభ్యులు బహిష్కరించారు. దీంతో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పదవిని కోల్పోయారు.

**కూటమి నేతల సంబరాలు..**

వైకాపా మేయర్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో జీవీఎంసీ కార్యాలయం వద్ద కూటమి నేతలు సంబరాల్లో మునిగితేలారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచి వేడుకలు చేసుకున్నారు.

# గోశాల మాజీ డైరెక్టర్‌పై కచ్చితంగా చర్యలు తీసుకుంటాం: టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

**తిరుపతి:** వైకాపా హయాంలో గోవుల గడ్డిని కూడా తినేశారని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు మండిపడ్డారు. గోశాలలోని గోవులను ఒంగోలుకు తరలించి కమీషన్లకు అమ్మేశారని ఆరోపించారు. తిరుపతిలో టీటీడీ గోసంరక్షణశాలను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. గోశాల మాజీ డైరెక్టర్ హరినాథరెడ్డి అక్రమాలు అన్నీఇన్నీ కావన్నారు. ఆయన బాగోతం బయటపడుతుందని రికార్డులు ఎత్తుకెళ్లారని విమర్శించారు. ''భాజపా నేత సుబ్రమణ్యస్వామికి గోశాలలో అన్యాయాలు కనిపించలేదా? వైకాపాపై ఆయన ఎందుకు పిల్ వేయలేదు? టీటీడీ అంటేనే ఒంటికాలిపై లేచే సుబ్రమణ్యస్వామి నిజానిజాలు ఏంటో తెలుసుకోరా? గోశాలలో నలుగురు సభ్యులతో కూడిన కమిటీ వేస్తాం. ఇక్కడ ఏం జరుగుతోందన్నది కమిటీ తేలుస్తుంది. వైకాపా చేసిన తప్పును మాపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. తప్పు చేసిన వారు తప్పించుకోలేరు. సీఎం చంద్రబాబు దష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తా. టీటీడీ గోశాల మాజీ డైరెక్టర్ హరినాథరెడ్డిపై కచ్చితంగా చర్యలు ఉంటాయి'' అని బీఆర్ నాయుడు తెలిపారు.

# భారత్ రానున్న ఎలాన్ మస్క్

(మొదటి పేజీ తరువాయి)

చూస్తున్నట్లు సోషల్ మీడియా ప్లాట్ ఫాం ఎక్స్ వేదికగా ఎలాన్ మస్క్ వెల్లడించారు. ఎలాన్ మస్క్ భారత పర్యటన ఇప్పటికే అనేక సార్లు వాయిదా పడింది. వాస్తవానికి ఎలాన్ మస్క్ ఏప్రిల్ 21-22 తేదీలలో భారతదేశానికి రావాల్సి ఉంది. కానీ ఎలాన్ మస్క్ ఏప్రిల్ 21, 22 తేదీల్లో భారతదేశంలో ఉంటారని ముందుగా వార్తలు వచ్చాయి.

ఈ సమయంలో ఆయన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కూడా కలుస్తారని, దీంతో పాటు, టెస్లా, అతని బృందం ప్రభుత్వ అధికారులు, పరిశ్రమ ప్రతినిధులను కలుస్తారని వార్తలొచ్చాయి. కానీ ఇవి ఖరారు కాలేదు. దీనికి ముందు కూడా మస్క్ భారత్ పర్యటన పలు మార్లు వాయిదా పడింది.

**మోడీ, మస్క్ రెండుసార్లు భేటీ**

ఈ క్రమంలో ఎలాన్ మస్క్ వచ్చే పర్యటన భారతదేశానికి మొదటి సందర్శన అవుతుంది. ఈ సమయంలో మస్క్ భారతదేశంలో టెస్లా తయారీ కర్మాగారం గురించి కీలక ప్రకటన చేసే అవకాశం ఉంది. ప్రధాని నరేంద్ర మోడీ, మస్క్ ఇప్పటివరకు రెండుసార్లు కలిశారు. వీరిద్దరూ 2015లో కాలిఫోర్నియాలోని టెస్లా ఫ్యాక్టరీలో కలిశారు. ఆ తర్వాత జూన్ 2023లో న్యూయార్క్‌లో కలుసుకున్నారు. ఎలాన్ మస్క్ భారతదేశంలో 2 నుంచి 3 బిలియన్ డాలర్ల పెట్టుబడి గురించి ప్రణాళికలను ప్రకటించనున్నారు.

భారతదేశంలో టెస్లా కార్లను తయారు చేయడమే కాకుండా, ఇక్కడి నుంచి ప్రపంచ దేశాలకు కూడా ఎగుమతి చేయనున్నారు. మరోవైపు చైనా, అమెరికా మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతున్న వేళ టెస్లా కార్ల తయారీకి ఇప్పుడు భారత్ మంచి అవకాశమని ఆర్థిక నిపుణులు అంటున్నారు. దీంతోపాటు ఇండియాలో తయారు చేసి విదేశాలకు కూడా ఎగుమతి చేసుకోవచ్చన్నారు. ఇప్పటికే ఐఫోన్లను తయారు చేస్తున్న భారత్, త్వరలో టెస్లా కార్లను కూడా సిద్ధం చేయనుంది.



# జపాన్‌లో ఉద్యోగాలు

## రెండు జపనీస్ సంస్థలతో టామ్‌కామ్ ఒప్పందాలు

**హైదరాబాద్,మనం బ్యూరో:** తెలంగాణ యువతకు అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలను విస్తరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. కార్మిక ఉపాధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) జపాన్‌లోని రెండు ప్రముఖ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. టెర్న్ (టీజీయూకే టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్), రాజ్ గ్రూప్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఎంవో యూలు చేసుకుంది. శనివారం జపాన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలో అధి కారుల బృందం ఆ రెండు సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపింది. తెలంగాణలో నైపుణ్యమున్న నిపు ణులను జపాన్‌లోని అధిక డిమాండ్ ఉన్న రంగాలలో ఉద్యోగ అవకాశాలను కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. టెర్న్ గ్రూప్ టోక్యోలో ప్రాంతీయ కార్యాలయంతో పాటు సాఫ్ట్‌వేర్, ఇంజనీ రింగ్, స్కిల్డ్ వర్కర్ రంగాలలో అంతర్జాతీయ నియామ కాలు చేపడుతుంది. రాజ్‌గ్రూప్ జపాన్‌లో పేరొందిన నర్సింగ్ కేర్ సంస్థ తుకుయి కార్పొరేషన్ లిమిటెడ్



భాగస్వామ్యంతో గతంలో టామ్ కామ్‌తో కలిసి పని చేసింది. కొత్త ఒప్పందంతో హెల్త్ కేర్ రంగంతో పాటు ఇతర రంగాల్లోనే సహకారం విస్తరించనుంది. ఈ రెండు జపనీస్ సంస్థలు రాబోయే ఒకటి నుంచి రెండు సంవత్సరాలలో సుమారు 500 ఉద్యోగాలను అందించనున్నాయి. హెల్త్‌కేర్, నర్సింగ్ రంగంలో 200 ఉద్యోగాలు, ఇంజనీరింగ్ రంగంలో ఆటోమో టివ్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో 100 ఉద్యోగాలు, హాస్పిటాలిటీ రంగంలో 100 ఉద్యోగాలు, నిర్మాణ రంగంలో 100 ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి. యువతకు నైపుణ్యాల శిక్షణతో పాటు అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యాలకు ఈ ఒప్పందాలు అద్దం పట్టాయి.

# గగనంలో 'స్మైలీ ఫేస్' అద్భుతం..!

**న్యూయార్క్, ఏప్రిల్ 19:** ఎన్నో అద్భుతాలకు నెలవైన ఖగోళంలో ఓ అందమైన దృశ్యం ఆవిష్కృతం కానుంది. సౌరకుటుంబంలోని శుక్రుడు, శని, నెలవంక (చంద్రుడు) సమీపంలోకి రానుండటంతో గగనతలంలో 'స్మైలీ ఫేస్' ఏర్పడనుంది. ఏప్రిల్ 25న ఈ దృశ్యం కనిపించనుందని సైన్స్ వెబ్‌సైట్ లైవ్‌సైన్స్ వెల్లడించింది.

ఏప్రిల్ 25న తెల్లవారుజామున ముందు శుక్రుడు, శని, నెలవంక అతి సమీపంలోకి రానున్నాయి. ఒక దగ్గరే కనిపించనున్న ఆ మూడు.. 'స్మైలీ ఫేస్' ఆకృతిని ప్రతిబింబించనున్నాయి. ఆకాశం నిర్మలంగా ఉంటే..సూర్యోదయానికి ముందు అతికొద్ది సమయం మాత్రమే కనిపించనున్న ఈ దృశ్యాన్ని ప్రపంచంలో ఎక్కడినుంచైనా వీక్షించేందుకు అవకాశం ఉంది. తూర్పు దిశగా భూమి లేక సముద్రం.. ఒక రేఖ వద్ద ఆకాశంతో కలుస్తున్నట్టుగా ఉన్నదగ్గర దీనిని చూడవచ్చు. ఆ గీతకు ఎగువన శుక్రుడు, కిందివైపు శని.. ఇంకా కిందికి నెలవంక ఒక దగ్గరకు రానున్నాయి.

ఈ రెండు గ్రహాలు నయనాలుగా, నెలవంక చిరునవ్వుతో ఉన్న పెదాలుగా కనిపించనుంది. ఈ వివరాలను అమెరికా అంతరిక్ష సంస్థ నాసా సోలార్ సిస్టమ్ అంబాసిడర్ బ్రెండా కల్బర్ట్‌సన్ వెల్లడించారు. శుక్రుడు, శని ప్రకాశవంతంగా ఉండటంతో వాటిని మామూలుగా వీక్షించవచ్చు. అయితే నవ్వుతున్న చిత్రాన్ని చూసేందుకు మాత్రం స్టార్‌గేజింగ్ బైనాక్యులర్, టెలిస్కోప్ అవసరం కానున్నాయి. ఆకాశంలో ఎలాంటి మేఘాలు లేకపోతే.. అదే సమయంలో ఈ మూడింటి కింద బుధుడిని చూడొచ్చని మీడియా కథనం పేర్కొంది.

# మే2న కేదార్‌నాథ్ ఆలయ ప్రవేశం

**డెహ్రాడూన్,ఏప్రిల్ 19:** ఛార్‌ధామ్ యాత్ర రాష్ట్రానికి ఆర్థిక పరిపుష్టి కలిగించే కీలకమైన యాత్ర అని,యాత్రికుల భద్రత,సౌకర్యాల కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామ్ తెలిపారు. ఛార్ థామ్ యాత్ర ఏప్రిల్ 30 నుంచి ప్రారంభం కానుంది. ఈ యాత్రలో గంగోత్రి, యమునోత్రి ద్వారాలు ఏప్రిల్ 30న తెరుచుకోనున్నాయి. అనంతరం కేదార్‌నాథ్ తలుపులు మే 2, బద్రీనాథ్ తలుపులు మే 4న తెరుచుకుంటాయని శ్రీ బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ ప్రకటించింది. యాత్రలో ఎలాంటి ఆటంకాలు కలుగుకుండా చూసేందుకు, సురక్షితంగా యాత్రికులు తమ యాత్ర పూర్తి చేసుకునేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ థామ్ చెప్పారు. ఛార్‌ధామ్ యాత్ర సంప్రదాయబద్ధంగా యమునోత్రితో మొదలై బద్రీనాథ్‌తో ముగుస్తుంది.



# ఎక్స్‌టెన్షన్ ఒత్తిళ్లు?

- ప్రభుత్వానికి తలనొప్పి?.. క్యూలో ఐదుగురు ఐపీఎస్‌లు
- పదవీవిరమణ పొందినా ఎక్స్‌టెన్షన్ కోసం చక్కర్లు
- ఇప్పటికే ఏడాది ఎక్స్‌టెన్షన్ పొందిన సందీప్ శాండిల్యా
- మరో ఏడాది ఇవ్వాలంటూ విశ్వప్రయత్నాలు
- అదే బాటలో డ్రగ్స్ కంట్రోల్ డీజీ కమలాసన్‌రెడ్డి
- మాకు ఇవ్వాలంటూ మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ
- నేను సైతం అంటున్న మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్
- రెండేళ్ల పాటు ఎక్స్‌టెన్షన్ పొందిన ఏఆర్ శ్రీనివాస్
- రిటైర్ అయిన వారికి ఎక్స్‌టెన్షన్ ఇవ్వడంపై దుమారం

**హైదరాబాద్, మనం బ్యూరో:** తెలంగాణ పోలీసుశాఖలో ఐపీఎస్ అధికారుల వ్యవహారం ప్రభుత్వానికి తలనొప్పిగా మారుతోంది. పదవీవిరమణ పొందినా సరే, కుర్చీలను వదలడానికి ఏమాత్రం ఇష్టపడటం లేదు. తమకున్న పరిచయాలను అడ్డంపెట్టుకుని పదవీ విరమణ తేదీకి దగ్గరగా ఉన్న ఐపీఎస్‌లతో పాటు, రిటైర్డ్ అయిన ఐపీఎస్ అధికారులు పైరవీలకు పాల్పడుతున్నారు. తమ ఆరోగ్యం బాగా ఉందని, తాము ఇంకా సర్వీసులో కొనసాగేందుకు అవకాశం ఇవ్వడంటూ ఎక్స్ టెన్షన్‌లను కోరుతున్నారు. సర్వీసు రూల్స్ ప్రకారం ఎక్స్‌టెన్షన్ అనేది పూర్తిగా చట్ట విరుద్ధమే. ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే, అధికారుల కొరత ఉన్నప్పుడు మాత్రమే ఎక్స్‌టెన్షన్‌కు ప్రభుత్వం మొగ్గు చూపాలి. కానీ ప్రస్తుతం ఎక్స్‌టెన్షన్ కోరుతున్న ఐపీఎస్‌ల తీరు మరోలా ఉంది. అనేక మంది ఐపీఎస్‌లు లూప్‌లైన్లలో ఉన్నప్పటికీ, వారంతా పోలీసుశాఖలో విధులు కొనసాగేందుకు సిద్ధంగా ఉన్నా.. వారిని పక్కనబెట్టి రిటైర్డ్ అయిన ఐపీఎస్ అధికారులకు ఎక్స్‌టెన్షన్‌లు ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎక్స్‌టెన్షన్‌లు ఇవ్వడం అనేది ప్రభుత్వానికి భారమే అని చెప్పాలి. అయినా మొహమాటానికో.. ఒత్తిళ్లు.. అధికారి ప్రాధాన్యతను బట్టో, ఇష్టానుసారంగా ప్రభుత్వం ఐపీఎస్‌లకు ఎక్స్‌టెన్షన్ ఇస్తూనే ఉంది. సర్వీసులో ఉన్న ఐపీఎస్‌లకు అన్యాయం చేసేలా.. రిటైర్డ్ ఐపీఎస్‌లకు ఎక్స్‌టెన్షన్‌లు ఇవ్వడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారుతోంది.

జిల్లాల ఎస్పీలు చేసిన వారి నుంచి మొదలు.. సీపీలు.. అడిషనల్ డీజీ.. డీజీ హోదాలో రిటైర్డ్ అయిన అధికారులంతా ఇప్పుడు ఎక్స్‌టెన్షన్ కోసం ప్రభుత్వం వద్దకు క్యూ కడుతున్నారు. తెలిసిన మంత్రినో, లేదంటే వివిధ మార్గాల ద్వారా ఎక్స్‌టెన్షన్‌కు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటివరకు ఎక్కడా ఖాళీ లేకుండా.. అన్ని ఫోకల్ పోస్టింగులు చేసిన ఐపీఎస్‌లు సైతం ఎక్స్‌టెన్షన్‌లు కోరడంపై.. పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే అనేక మంది డైనమిక్ ఐపీఎస్ లు వెయిటింగ్‌తో పాటు..నాన్ ఫోకల్, లూప్‌లైన్లలో ఉన్నప్పటికీ, వారిని కాదని ఉద్యోగ విరమణ పొందిన వారితో పాటు, ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్నవారికి ఎక్స్‌టెన్షన్ ఇవ్వడంపై ప్రభుత్వంపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నందున సీఎం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని బ్యూరోక్రాట్స్ కోరుతున్నారు.

**మరో ఏడాది?**

సీఎం రేవంత్‌రెడ్డిని ముగ్గురు ఐపీఎస్‌లు తమకు సర్వీస్ ఎక్స్‌టెన్షన్ ఇవ్వాలంటూ కోరుతున్నారు. వారిలో ఇప్పటికే గతేడాది ఐదో నెలలో పదవీ విరమణ పొంది.. ఏడాదిపాటు ఎక్స్‌టెన్షన్ పొందిన నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్యాకు ఈ ఏడాది మే నెలతో అతని సర్వీసు పొడగింపు కాలం ముగుస్తుంది. అయినా సరే మరో ఏడాది పాటు తనను నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్‌గా పొడగించేలా.. సర్వీసు ఎక్స్‌టెన్షన్ ఇవ్వాలంటూ ప్రభుత్వం దగ్గరకు తన అభ్యర్థనను పంపినట్లు తెలుస్తోంది. నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్‌గా పనిచేసేందుకు అనేక మంది ఐపీఎస్‌లు సిద్ధంగా ఉన్నారు. సీనియర్ ఐపీఎస్ అధికారులుగా చెప్పుకునే వారంతా, నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్‌గా పనిచేయాలని ఆసక్తి చూపుతున్నారు. కానీ ఇప్పటికే రిటైర్డ్ అయి ఏడాది గడిచి, మరో ఏడాది పాటు సర్వీసు ఎక్స్‌టెన్షన్ పొందిన సందీప్ శాండిల్యా..అదనంగా మరో ఏడాది అదే సీటులో కొనసాగేలా ఎక్స్‌టెన్షన్ కోరడంపై భిన్నాభిప్రయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం మరో ఏడాది అతనికి ఎక్స్‌టెన్షన్ ఇస్తే.. అనేక మంది ఐపీఎస్‌లకు అన్యాయం జరిగే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది.

**కమలాసన్‌రెడ్డిది అదే బాట?**

ప్రస్తుతం డ్రగ్స్ కంట్రోల్ డీజీగా పనిచేస్తున్న వీబీ కమలాసన్‌రెడ్డి సర్వీసు కాలం ఈనెల 30తో ముగుస్తోంది. గతంలో ఆయన కరీంనగర్ సీపీగా ఎంతో కాలం పనిచేశారు. అంతకుముందు హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో సెంట్రల్ జోన్ డీసీపీగా పనిచేశారు. ఎక్కడా లూప్‌లైన్ పోస్టింగులో లేకుండా..అన్ని ఫోకల్ పోస్టింగుల్లో కొనసాగిన అధికారిగా ఆయనకు పేరుంది. అయితే ఈనెలతో ఆయన పదవివిరమణ పొందనున్నారు. ఆయన కూడా ఎక్స్‌టెన్షన్ కోరుతున్న ఐపీఎస్‌ల జాబితాలో ఉన్నారు. మరో ఏడాది కాలం తన సర్వీసును ఎక్స్‌టెన్షన్ చేసి, ప్రస్తుతం కొనసాగుతున్న డ్రగ్స్ కంట్రోల్ డీజీ హోదాలోనే కొనసాగించేలా అవకాశం ఇవ్వాలంటూ ప్రభుత్వం వద్ద ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎంతోమంది ఐపీఎస్‌లు వెయిటింగ్‌లో ఉన్నా సరే.. డ్రగ్స్ కంట్రోల్ డీజీగా అతన్నే మరో ఏడాది పాటు ఎలా కొనసాగిస్తారని ఇతర ఐపీఎస్ అధికారులు గుర్రుగా ఉన్నట్లు సమాచారం.

**సత్యనారాయణ.. ఉదయ్‌కుమార్?**

ప్రస్తుతం మల్టీజోన్ -2 ఐజీగా కొనసాగుతున్న వీ.సత్యనారాయణ ఈ ఏడాది జూన్ నెలలో పదవీ విరమణ పొందనున్నారు. తన సర్వీసులో అన్నీ దాదాపుగా ఫోకల్ పోస్టింగుల్లోనే కొనసాగారు. రామగుండం, కరీంనగర్ సీపీగా పనిచేశారు. రాచకొండ పోలీసు కమిషనరేట్ జాయింట్ సీపీగా కొనసాగారు. అంతుకుముందు సౌత్‌జోన్ డీసీపీగా తన పీరియడ్‌ను కంప్లీట్ చేశారు. ప్రస్తుతం మల్టీజోన్-2 ఐజీగా ఉన్న సత్యనారాయణ, రెండునెలల్లో రిటైర్డ్ కాబోతున్నారు. తనకు స్థానికంగా ఉన్న రాజకీయ నేతల పరిచయాలను ఆసరగా చేసుకుని, తాను సర్వీసులో మరో ఏడాదిపాటు కొనసాగేలా ఎక్స్‌టెన్షన్ కోసం ఎదురుచూస్తున్నారని సమాచారం. ఇందుకోసం ఇప్పటికే జీఏడీతో పాటు, సీఎం వద్దకు తన పేరు వెళ్లేలా రూట్ క్లియర్ చేసుకున్నట్లు తెలుస్తోంది.

# టిటిడి గోశాలలో గడ్డినీ వదలని గత పాలకులు

- టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు



**తిరుపతి, ఏప్రిల్ 19 మనం న్యూస్:** టిటిడి గోశాలలో గోవులకు పెట్టే గడ్డిని కూడా గత పాలకులు వదలలేదని టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడారు. టిటిడి గోశాలలో ఆల్ ఇండియా గోసంరక్షణ సంస్థ ప్రధాన కార్యదర్శి, టిటిడి గోసంరక్షణ పూర్వ సభ్యులు కోటి శ్రీధర్ , టిటిడి బోర్డు సభ్యులు, మీడియాతో కలిసి ఛైర్మన్ శనివారం పరిశీలించారు. ప్రస్తుతం గోవులకు అందుతున్న దాణా, త్రాగునీరు, పరిశుభ్రత, అవసరమైన వైద్యం జరుగుతుందా తదితర అంశాలను గోశాల ఇంఛార్జి డైరెక్టర్ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. గోశాలలో గోవులు, పేయ దూడలు ఉంటున్న షెడ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. టిటిడి గోశాలపై కోర్టుల్లో పిల్స్ దాఖలు చేస్తామని కొంత మంది ఫోన్ లు చేస్తున్నారని, వారిని ఒకటే కోరుతున్నా, గత ఐదేళ్ల పాలనలో టిటిడిలో జరిగిన నిధుల స్వాహా, అవకతవకల అంశాలను జోడించి కోర్టుల్లో కేసులు దాఖలు చేస్తే వారికి పూర్తి సహకారం అందిస్తామని ఛైర్మన్ చెప్పారు . గతంలో పింక్ డైమండ్ మీద కోర్టులో కేసు వేశారని, ఆ కేసు ఏమైందని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక టిటిడిలో ఎలాంటి అవినీతి జరుగలేదని తాను హామీ ఇస్తున్నానని చెప్పారు. టిటిడిలో గత 10 నెలల్లో ఏమి జరుగకపోయినా ఏదో జరిగిపోతున్నట్లు కొంత మంది ఉద్దేశ్యపూర్వకంగా చేస్తున్న గ్లోబల్ ప్రచారం, డైవర్షన్ పాలిటిక్స్ చేయడం సరికాదని సూచించారు. 2023-24 ఏడాదిలో అప్పట్లో టిటిడి గోసంరక్షణ సలహాదారు శ్రీ కోటి శ్రీధర్ చెప్పిన మాటలను చూస్తుంటే , టిటిడి గోశాలలో జరిగిన అవకతవకలపై మాకు తెలిసింది కొంతే, ఇంకా చాలా ఉందని చెప్పారు. టిటిడి గోశాల గోవులను కూడా ఒంగోలులో అమ్ముకున్నట్లు తెలుస్తోందన్నారు.

గతంలో టిటిడి గోశాల సంచాలకులుగా పనిచేసిన డా. హరినాథ్ రెడ్డి టిటిడి గోశాలను సొంత ఎస్టేట్ లాగా భావించి భారీ అవకతవకలకు పాల్పడినట్లు తెలుస్తోందన్నారు. ఎవరిని గోశాలలోకి రానివ్వకుండా హరినాథ్ రెడ్డి నియంతృత్వంగా వ్యవహరించారన్నారు. వైద్యులను, ఇతరులను గోశాలకు రానివ్వకుండా వేధించారణే ఆరోపణలు ఉన్నాయన్నారు.

టిటిడిలో జరిగిన పలు అవకతవకలపై అవసరమైతే ఏసీబీ విచారణ కోరుతామని ఛైర్మన్ మాట్లాడారు.

ఈ సందర్భంగా టిటిడి బోర్డు సభ్యులు జి. భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, టిటిడి గోశాలలో గోవుల సహజ మరణాలపై అసత్య ప్రచారం చేసి, టిటిడి ప్రతిష్టతను పలుచన చేస్తున్న టిటిడి పూర్వ ఛైర్మన్ బి కరుణాకర్ రెడ్డి పై పోలీస్ స్టేషన్ లో కేసు పెట్టామని, వాటికి సంబంధించిన పూర్తి వివరాలు తమ దగ్గర ఉన్నాయన్నారు. చట్టాలనుండి తప్పించుకోలేరని మాట్లాడారు.

టిటిడి గోశాలలో గత పాలకుల పాలనలో ఉన్న పూర్వ సంచాలకులు డాక్టర్ శ్రీ హరినాథ్ రెడ్డి పలు అక్రమాలకు పాల్పడ్డారని గతంలో గోశాల సంరక్షణ సభ్యులుగా పనిచేసిన కోటి శ్రీధర్ ఆరోపించారు. మందులు, గడ్డి, ఇతర రాష్ట్రాల నుండి గోవుల కొనుగోలులో భారీగా అవకతవకలు, గోవులు ప్రసవం అయ్యాక గోవులు ఏమయ్యాయో పూర్తి స్థాయిలో లెక్కలు లేవని ఆయన ఆరోపించారు. టిటిడి గోశాలను వివాదం చేయవద్దని ఆయన కోరారు. ఈ సమావేశంలో టిటిడి బోర్డు సభ్యులు జి.భానుప్రకాశ్ రెడ్డి, శాంతా రామ్, నరేష్ కుమార్, ఆల్ ఇండియా గోసంరక్షణ జనరల్ సెక్రటరీ కోటి శ్రీధర్ పాల్గొన్నారు.

# కేంద్రీయ విచారణ కార్యాలయం పునర్వ్యవస్థీకరణపై టీటీడీ ఈవో సమీక్ష



**తిరుపతి, ఏప్రిల్ 19 మనం న్యూస్ :** తిరుమలలో పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా కేంద్రీయ విచారణ కార్యాలయంలో మెరుగైన వసతులు కల్పించేందుకు టీటీడీ ఈవో జె.శ్యామల రావు అదనపు ఈఓ సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి శనివారం తిరుమలలోని అన్నమయ్య భవన్ లో కేంద్రీయ విచారణ కార్యాలయం పునర్వ్యవస్థీకరణపై సమీక్ష నిర్వహించారు.

తిరుమలలోని కేంద్రీయ విచారణ కార్యాలయం భక్తులకు వసతి, దర్శన టికెట్లు, ఇతర అవసరమైన సేవలను అందించే ప్రధాన కేంద్రంగా పనిచేస్తుంది. అయితే గత కొంత కాలంగా, ముఖ్యంగా రద్దీ సమయంలో సీఆర్వోకు అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తుతున్నారు.

ఈ భవనాన్ని చాలా దశాబ్దాల క్రితం నిర్మించడంతో రోజురోజుకీ పెరిగిపోతున్న భక్తుల సంఖ్యత తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారు.

ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు, విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్కు చెందిన ఆర్కిటెక్ట్, అర్బన్ డిజైనర్ డాక్టర్ జి.కార్తీక్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపొందించి సమగ్ర పునర్వ్యవస్థీకరణ ప్రణాళికను టీటీడీ అధికారులకు వివరించారు.

ఈ ప్రజెంటేషన్లో భక్తుల రాకపోకలను సులభతరం చేయడం, స్థల వినియోగాన్ని సమర్థవంతంగా చేసుకోవడం, సిఆర్వో, పీఏసీ-1 ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలపై లోతైన అధ్యయనం చేసి పలు ప్రతిపాదనలను వెల్లడించారు. ఈ పునర్వ్యవస్థీకరణ ప్రణాళిక తిరుమల ఏడుకొండల ఆధ్యాత్మిక మహత్యాన్ని, పర్యావరణానికి అనుగుణమైన నగర ప్రణాళికా సూత్రాలను సమన్వయం చేస్తూ రూపొందించబడింది.

ఈ సందర్భంగా ఈఓ శ్యామలరావు మాట్లాడుతూ ప్రత్యేక క్యూ లైన్లు, భక్తులు వేచి ఉండే ప్రాంతాలు, ప్రస్తుత భవనాల పునరుద్ధరణ వంటి అంశాలపై విశ్లేషణాత్మకంగా చర్చించారు. ఈ ప్రణాళిక టీటీడీ దీర్ఘకాలిక మాస్టర్ప్లాన్కు అనుగుణంగా కూడా ఉండాలని సూచించారు.

ప్రస్తుత రద్దీ పరిస్థితులను చక్కదిద్దడం , కొన్ని దశాబ్దాలుగా ఉన్న భవనాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం, అలాగే వచ్చే కొన్ని దశాబ్దాల అవసరాలను దృష్టిలో ఉంచుకోవడం ఈ ప్రణాళిక యొక్క ముఖ్య ఉద్దేశమని ఈఓ స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో టీటీడీ చీఫ్ ఇంజినీర్ సత్యనారాయణ, టీటీడీ పట్టణ ప్రణాళిక- డిజైన్ నిపుణులు రాముడు, తిరుమల ఎస్టేట్ అధికారి వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, వీజీవోలు శ్రీరాంకుమార్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# లాంగ్ వీకెండ్ కావడంతో తిరుమలకు పోటెత్తిన భక్తులు..

- స్వామివారి దర్శనానికి 24 గంటలు సమయం

**తిరుమల, ఏప్రిల్19, మనం న్యూస్:** కలియుగ వైకుంఠం తిరుమల భక్తజన సంద్రంగా మారింది.. పెద్ద ఎత్తున భక్తులు తిరుమలకు పోటెత్తడంతో సప్తగిరులు గోవిందనామ స్మరణతో మార్మోగుతున్నాయి. శుక్రవారం గుడ్ ఫ్రైడే కావడంతో లాంగ్ వీకెండ్ కలిసొచ్చింది భక్తులకు..



శనివారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. ఈ క్రమంలో సర్వదర్శనానికి 24 గంటల సమయం పడుతున్నట్లు సమాచారం. ఉచిత సర్వదర్శనానికి అన్ని కంపార్ట్ మెంట్లు నిండి బయట టీబీసీ వరకు క్యూలైన్లలో భక్తులు వేచి ఉన్నారు.ఇక టైమ్ స్లాట్ దర్శనానికి 6 గంటలు, రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శనానికి సుమారు 5 గంటల సమయం పడుతోందని టీటీడి సమాచారం ఇచ్చింది. ఇదిలా ఉండగా.. శుక్రవారం తిరుమల శ్రీవారిని 58,519 మంది భక్తులు దర్శించుకోగా.. 30,360 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నట్లు తెలిపారు టీటీడీ అధికారులు. శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.27 కోట్ల వచ్చినట్లు తెలిపారు అధికారులు. భక్తుల రద్దీకి తగ్గట్టు ఏర్పాట్లు చేపట్టామని.. రద్దీ ప్రాంతాలలో శ్రీవారి సేవకుల ద్వారా పాలు, నీళ్ళు, అన్న ప్రసాదాలు పంపిణి చేస్తున్నామని టీటీడీ అధికారులు తెలిపారు.

# వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లో టీటీడీ చైర్మన్ ఆకస్మిక తనిఖీలు

**తిరుపతి, ఏప్రిల్ 19 మనం న్యూస్ :** శ్రీవారి దర్శనార్థం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లో టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు శనివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. భక్తుల రద్దీ పెరగడంతో నారాయణగిరి షెడ్లు, క్యూలైన్లు, కంపార్ట్ మెంట్లలో భక్తుల కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం అక్షయ కిచెన్ ను తనిఖీ చేసి భక్తుల కోసం తయారు చేస్తున్న అన్న ప్రసాదాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎలాంటి జాప్యం లేకుండా భక్తులకు ఎప్పటికప్పుడు అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు నిరంతరాయంగా పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా భక్తులతో మాట్లాడుతూ అధిక రద్దీ కారణంగా



దర్శనం కోసం వేచి ఉండే సమయం పెరుగుతుండటంతో ఎలాంటి ఆందోళన చెందకుండా టీటీడీ కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని సంయమనంతో శ్రీవారిని దర్శించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు నరేష్ కుమార్, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, ఏఈవో శ్రీనివాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు



## తిరుమల శ్రీవారి సేవలో సినీనటి సమంత

- శుభం సినిమా చిత్ర బృందం

**తిరుమల, ఏప్రిల్ 19, మనం న్యూస్:** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ప్రముఖ సినిమా హీరోయిన్ సమంత శుభం సినిమా చిత్ర బృందంతో కలిసి శనివారం ఉదయం స్వామివారి నైవేద్యం విరామ సమయం అనంతరం దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు దర్శనం అనంతరం రంగనాయక మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా టీటీడీ అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. సమంత గత సంవత్సరంలో 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' పేరుతో సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ బ్యానర్ పైనే ఆమె 'శుభం' చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా మే 09వ తేదీన విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందంతో కలిసి ఆమె తిరుమల రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. సమంతా అన్యమతస్థురాలు కావడంతో శ్రీ వేంకటేశ్వర స్వామివారిని విశ్వసిస్తున్నానని డిక్లరేషన్ పైనా సంతకం చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

# సన్న బియ్యం లబ్ధిదారుని ఇంట్లో

- సహపంక్తి భోజనం చేసిన ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ /దుగ్గొండి: 19 ఏప్రిల్ (మనం ప్రతినిధి):** వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని ముద్దునూరులో సన్న బియ్యం లబ్ధిదారుడు దిద్దే సరోజన చేరాలు కుటుంబ సభ్యులతో కలిసి మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడి కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సన్నబియ్యం ఎలా ఉన్నాయంటూ అడిగారు. మీతో కలిసి భోజనం చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ .... సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆ దిశగానే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పేద, సామాన్య ప్రజల కడుపు నింపేందుకు ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తోందని అన్నారు. గతంలో రేషన్ దుకాణాల ద్వారా దొడ్డు బియ్యం పంపిణీ చేస్తుండగా వాటిని చాలా మంది లబ్ధిదారులు తినేందుకు విముఖత చూపుతూ ఇతరులకు విక్రయించేవారని, సన్నబియ్యం మార్కెట్లో కొనుక్కుని తినేవారన్నారు. ప్రభుత్వంపై భారం పడుతున్నా పేద సామాన్య ప్రజలు కడుపునిండా తినేందుకు సన్నబియ్యం పంపిణీ చేస్తోందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి గారు మాట్లాడుతూ ప్రభుత్వం... తీసుకొచ్చిన సంక్షేమ పథకాలు పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఉపయోగపడుతుందని, ఉచిత సన్న బియ్యం పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు నాణ్యమైన బియ్యం అందించాలన్నదే ప్రభుత్వ ఆశయమని,పేద ప్రజలు ఆకలితో బాధపడకుండా పోషకాహారాన్ని పొందాలన్నదే ఈ పథక ప్రధాన ఉద్దేశమని వివరించారు.సన్న బియ్యం అమలులో ఎలాంటి ఇబ్బందులు లేని విధంగా చర్యలు తీసుకోవాలని,పంపిణీ వ్యవస్థలో ఎలాంటి



సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సూచించారు. పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఉపయోగపడుతుందని, ఉచిత సన్న బియ్యం పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు నాణ్యమైన బియ్యం అందించాలన్నదే ప్రభుత్వ ఆశయమని,పేద ప్రజలు ఆకలితో బాధపడకుండా పోషకాహారాన్ని పొందాలన్నదే ఈ పథక ప్రధాన ఉద్దేశమని వివరించారు.సన్న బియ్యం అమలులో ఎలాంటి ఇబ్బందులు లేని విధంగా చర్యలు

తీసుకోవాలని,పంపిణీ వ్యవస్థలో ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సూచించారు.

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ**

రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేసిన సన్నబియ్యం భోజనం చాలా బాగుందని, మన ప్రాంతంలో రైతులు పండించిన వరిధాన్యపు బియ్యాన్ని మనం తినే అవకాశం దక్కడం అదృష్టంగా భావించాలని అన్నారు. గతంలో ఎన్నడు లేనివిధంగా రేషన్ దుకాణాల్లో బియ్యం నిల్వలు లేకుండా ప్రతీకార్డుదారు సన్నబియ్యం తీసుకెళ్తున్నారన్నారు. ఇప్పటి వరకే రేషన్ దుకాణాల్లో 90శాతం పంపిణీ పూర్తి అయిందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆదనపు కాలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ ఉమారాణి, జిల్లా పౌర సరఫరాల అధికారి కిష్టయ్య, జిల్లా మేనేజర్ సంధ్యారాణి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

- నిర్ణీత గడువులోపు భూమి మ్యూటేషన్ దరఖాస్తుల పరిష్కారం
- ఆధార్ తరహాలో భూదార్ సంఖ్య కేటాయింపు
- భూ భారతి చట్టం అవగాహన సదస్సులలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

**గోవిందరావుపేట, ఏప్రిల్ 19 (మనంన్యూస్):** భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంపై రైతులు పరిపూర్ణమైన అవగాహన ఏర్పర్చుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సూచించారు. శనివారం ములుగు మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణం లో, గోవిందరావు పేట మండలం కేంద్రం లోని రైతు వైదిక లో వేర్వేరుగా నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సులలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల నుండి అభ్యంతరాలను తెలుసుకున్న అనంతరం జిల్లా



కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి చట్టం ద్వారా రైతులకు చేకూరే ప్రయోజనాల గురించి కలెక్టర్ ఒక్కో అంశం వారీగా వివరించారు. భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం రూపొందించిన భూ భారతి (ఆర్ ఓ ఆర్) చట్టం - 2025 జనవరిలో గెజిట్ రూపంలో వచ్చిందని, సమగ్ర అంశాలను పొందుపరుస్తూ ప్రభుత్వం ఏప్రిల్ 14న ఈ చట్టాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ వివరించారు. భూ సమస్యలు కలిగిన రైతులు ఏడాది కాలం లోపు భూభారతి పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అవగాహన సదస్సుల అనంతరం మే మొదటి వారంలో అధికారులు గ్రామాల వారీగా సదస్సులను ఏర్పాటు చేసి అర్జీలు స్వీకరిస్తారని అన్నారు. భూ భారతి చట్టం ప్రకారం భూ సంబంధిత సమస్యలను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. సమస్య పరిష్కారం కాకుంటే కలెక్టర్ కు లేదా సీసీఎల్ఏ కు అప్పీల్ చేసుకోవచ్చని, ఈ చట్టంలో కొత్తగా ల్యాండ్ ట్రిబ్యునల్ కూడా అందుబాటులో ఉంటుందని సూచించారు. ధరణి లో రెవెన్యూ కోర్టులను తొలగించడం వల్ల భూ వివాదాల విషయంలో రైతులు సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని గుర్తు చేశారు. దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం ప్రస్తుత భూభారతి చట్టం ద్వారా ఇదివరకటి తరహాలోనే రెవెన్యూ కోర్టులు పునరుద్ధరించిందని వివరించారు. భూ సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకునేందుకు రెవెన్యూ డివిజన్ అధికారికి, కలెక్టర్ కు అధికారాలు కల్పించారని తెలిపారు. అయినా కూడా సమస్య పరిష్కారం కాలేదని రైతులు భావిస్తే అప్పీలు చేసుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం ధరణి లో ఉన్న భూ రికార్డులు భూ భారతి చట్టంలో కొనసాగుతాయని తెలిపారు. భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అర్హులైన వారు జిల్లాలో నూతన చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పెండింగ్ లో ఉన్న సాధా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. వీటికి సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు వెలువడనున్నాయని తెలిపారు. భూ భారతి చట్టం పై ఏమైనా సందేహాలు ఉంటే తీర్చడానికి అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని అన్నారు. ఈ చట్టంలోని అంశాలపై గ్రామాలలో విస్తృతంగా చర్చిస్తూ, తోటి రైతులకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.ఈ సదస్సులలో జిల్లా పంచాయతీ అధికారి దేవ్ రాజ్, తహసీల్దార్లు విజయ భాస్కర్, సృజన్ కుమార్, ఎం పి డి ఓ లు రామక్రిష్ణ, జవహర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి జితేందర్ రెడ్డి, స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ రజతోత్సవ సభ ప్రాంగనాన్ని సందర్శించిన ఎంపీ

**వరంగల్, ఏప్రిల్ 19 (మనం ప్రతినిధి):** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర శనివారం ఏప్రిల్ 27న ఎల్కతుర్తి, హనుమకొండ లో జరుగబోయే బీఆర్ఎస్ రజతోత్సవ సభ ప్రాంగనాన్ని సందర్శించడం జరిగింది.ఈ సభ ఏర్పాటు, పార్కింగ్, స్టేజి తదితరులు పనులను పర్యవేక్షించారు. అనంతరం ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ,27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సుమారు పది నుంచి పదిహేను లక్షల వరకు



తెలంగాణ నలుమూలల నుంచి ప్రజలు పాల్గొంటారు అని,కనీ వీని ఎరుగని రీతిలో ఈ సభ జరుగుతుంది అని వద్దిరాజు పేర్కొన్నారు. అనంతరం పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి గారి ఆహ్వానం మేరకు వారి నివాసం లో మధ్యాహ్నం భోజనం చేయడం జరిగింది.ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు,ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యే లు మాజీ ఎంపీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బండ నుండి మాట పుట్టదు

బండ నుండి మాట పుట్టదు
కొండ నుండి మాట పుట్టదు
మాట పుట్టేది నది నుండి
మాట పుట్టేది ఉదధి నుండి
సాటి దేశానికి సహాయమా
అణుబాంబు మాయలసాక్షి
తోటి దేశానికి సాయమా
అహంకార ఛాయలసాక్షి

నిరసనలో వ్యతిరేకతలో ఆగని అగ్నివృష్టి
అమాయక జనహననంతో ఆగినసృష్టి
అంతకంతకూ ఎర్రబడ్డ వాతావరణం
అనాగరిక దుశ్చేష్టలో అఖండ విధ్వంసం
అనాలోచిత పరాకాష్టలోఅనంత విషాదం

ఎగిరే పిట్టలకు ఉరితాళ్లు
ఎదిగే పైర్లకు సంకెళ్లు
శ్వాసించే హక్కు అందరిది
శాసించే హక్కు ఎవరిది
ఎవరి పైసాచికమో ఎవరి యుద్ధోన్మా దమో
మానవత ఘనీభవించింది
ఎవరి ఆగడాలో ఎవరి అహమో
రక్తం ఏరులై పారింది
సమరశంఖం పూరించినవాడా

రణతంత్రం నడిపినవాడా
శిథిలాల శకలాల సమాధుల
వినుతించిన విధివ్రాతల లిఖించినవాడా
కరకుబాణంతో విలవిల్లాడుతూ నేలరాలినపక్షితో
కరుణ పుట్టి బోయవాడు వాల్మి కైనాడు
కళింగ కదనరంగ కళేబరాల కరాలనృత్యంతో
అశోకుడు శోకతప్తుడయ్యాడు
నీలో
మాకో బుద్ధుడు కావాలి
ఐక్యరాజ్యసమితి కి నిబద్ధుడు కావాలి

**- కోటం చంద్రశేఖర్**
9492043348

# ఇంద్రవెల్లి ఏజెన్సీలో రక్తపుటేరులు



ఇంద్రవెల్లి కాల్పుల ఘటనకు 45 ఏళ్లు. ఇది 'స్వతంత్ర భారత జలియన్‌వాలా బాగ్' కథ. ఏప్రిల్ 20, 1981వ సంవత్సరం ఆదిలాబాద్ ఆదివాసీలకు చేదు జ్ఞాపకాలను మిగిల్చిన రోజు. ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతంలోని ఇంద్రవెల్లిలో ఓవైపు సంత జరుగుతోంది. ఈ సంతలో సరుకులు కొనడానికి వస్తున్న జనం ఒకవైపు ...మరోవైపు గిరిజన రైతు కూలీ సంఘం' సమావేశానికి జనం వస్తున్నారు. సభకు అనుమతి లేదని పోలీసులకు, ప్రజలకు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఆ క్రమంలో జరిపిన కాల్పుల్లో 13 మంది ఆదివాసీలు ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గాయపడ్డారు. అయితే, ఆ సంఖ్య ఎంత అనేది స్థానిక ఆదివాసీలు ఇప్పటికీ ఆ చేదు జ్ఞాపకాలను కథలు కథలుగా వినిపిస్తారు. ఇంద్రవెల్లి పోలీస్ కాల్పుల ఘటనను యావద్దేశం ముక్త కంఠంతో ఖండించింది. కాల్పుల ఘటనతో కుగ్రామంగా ఉన్న ఇంద్రవెల్లి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ప్రతిపక్షాలు, ప్రజాహక్కుల సంఘాలు 'స్వతంత్ర భారత జలియన్‌వాలా బాగ్'గా అభివర్ణించారు. ఏది ఏమైనా తెలుగు దేశ చరిత్రలో అత్యంత పాశవిక చర్యగా నిలిచిపోయింది.

కుమ్రం భీమ్ నుంచి ఇంద్రవెల్లి వరకు

కుమ్రం భీమ్ ఆధ్వర్యంలో ఆదివాసీలు సాగించిన 'జోడేన్ ఘాట్'ను నిజాం అణచివేశాడు. ఆ తర్వాత నిజాం ప్రభుత్వం కొన్ని సంస్కరణలు చేపట్టింది. ఆదివాసీల తిరుగుబాటు మూలాలపై మానవ పరిణామ శాస్త్రవేత్త 'హేమన్ డార్ఫ్' అధ్యయనం సూచనల మేరకు సుమారు లక్షన్నర ఎకరాల అటవీ పోడు భూములకు పట్టాల పంపిణీ చేశారు. ఆదివాసీలను అక్షరాస్యులగా చేసేందుకు ప్రత్యేక స్కూళ్లు, వృత్తి శిక్షణ కేంద్రాలు తెరిచారు. గిరిజన తెగలు, ప్రాంతాలను నోటిఫైడ్ ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించింది. కేస్లాపూర్ నాగోబా జాతర వేదికగా ఆదివాసీల సమస్యలు, ఆర్జీలను పరిష్కరించేందుకు 'దర్బార్'ను ప్రారంభించారు. గిరిజన ప్రాంతాలు, తెగలను గుర్తిస్తూ నోటిఫైడ్ ప్రాంతాలను ప్రకటించి, బయటి ప్రాంత వ్యక్తులపై ఆంక్షలు విధించింది. ఈ చర్యలతో ఆదివాసీలకు కాస్త ఉపశమనం దొరికింది. ఆ తర్వాత హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్లో విలీనం అయ్యింది. ఆదివాసీ ప్రాంతాలను రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ లో చేర్చారు. అనంతరం రాజ్యాంగబద్ధమైన చట్టాలను తెచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో



ఆదివాసీలకు రక్షణ కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ (షెడ్యూల్ ప్రాంతం) భూమి బదలాయింపు చట్టం -1959 తీసుకువచ్చారు. దీనికి 1970 సంవత్సరంలో మార్పులు చేశారు. దీన్నే 1/70 ( వన్ ఆఫ్ సెవంటీ) చట్టంగా పిలిచారు. ఈ రకంగా పకడ్బందీ చట్టాలు వచ్చినా... అందులోని లోపాలతో పెద్ద విస్తీర్ణంలో ఆదివాసీల భూములు అన్యాక్రాంతం అయ్యాయి. అంతేకాకుండా 1971 నాటికి గుడిహత్నూర్, ఆసిఫాబాద్, కరీంనగర్, నిర్మల్ ప్రాంతాలను కలుపుతూ రోడ్డు సౌకర్యం ఏర్పడి బయటి వ్యక్తుల రాకపోకలు పెరిగాయి. దీంతో ఈ ప్రాంతానికి వలసలు పెరిగాయి. వడ్డీ వ్యాపారులు క్రమంగా ఆ ప్రాంతాల్లో బలపడ్డారు. ఆదివాసులుగా గుర్తించని బంజారా/లంబాడాల చేతుల్లోకి భూమి, అధికారాలు మారుతుండటంతో గోండ్ ఆదివాసీల ప్రాబల్యం రోజురోజుకూ తగ్గుతూ వచ్చింది. ఇలా జీవనాధారమైన భూములు, పుట్టిన ప్రాంతంలోనే తమ అస్తిత్వం అన్యాక్రాంతం కావడం ఇంద్రవెల్లి పోరాటానికి కారణమైంది. ఈ క్రమంలో 1983లో ఇంద్రవెల్లి కాల్పులు జరిగిన ప్రాంతంలో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలో భాగంగా అమరవీరుల స్థూపం నిర్మించారు. అక్కడి ప్రజలకు కొన్ని మౌలిక సదుపాయాలను కల్పించింది. ప్రతి ఏటా ఏప్రిల్ 20న పెద్ద ఎత్తున అక్కడి ఆదివాసుల ఏకమై స్మరించుకోవడం జరుగుతుంది.

భూ పోరాటం కొనసాగింపు... లక్ష కిలోమీటర్ల రథయాత్ర

ఇంద్రవెల్లి ఘటనకు 45 ఏళ్లు గడిచిన...అక్కడి ప్రజల జీవితాలలో ఆశించిన పురోగతి లేదు. నాణ్యమైన విద్య, వైద్య సదుపాయాలు ఇంకా అందరికీ అందుబాటులో లేదు. ఉపాధి లేక కూలీలుగా జీవితాలను వెల్లదీస్తున్నారు. భౌతిక పురోగతే తప్ప, ప్రజల జీవన ప్రమాణాలలో మెరుగుదల అంతంత మాత్రమే. ఆదివాసీ తెగల అస్తిత్వ పోరు ఆగడం లేదు. ఆదివాసీల భూసమస్యలు చాలా వరకు అపరిష్కృతంగానే మిగిలిపోయాయి. అదే సందర్భంలో ఆదివాసీలు, లంబాడ గిరిజనుల మధ్య ఘర్షణ వాతావరణం కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో గత ఏడాది సుప్రీంకోర్టు ఎస్సీ, ఎస్టీల ఉప వర్గీకరణ సబబే అని తీర్పునివ్వడం జరిగింది. వీరిలో కూడా అంతర్గత అంతరాలు ఉన్నాయని స్పష్టం చేసింది. దీంతో జనాభా ప్రాతిపదికన వారికి విద్యా, ఉద్యోగాల్లో వారి రిజర్వేషన్ లలో ఉప వర్గీకరణను వర్తింపచేయాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఇటీవల తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఉప వర్గీకరణ చట్టం తెచ్చాయి. ఎస్టీలలో కూడా ఉపవర్గీకరణ జరగాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అప్పుడే సమాన అవకాశాలు లభిస్తాయి. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన బీసీ, ఎస్సీ, ఎస్టీలలో మెజార్టీ ప్రజల చేతిలో భూమి లేదు. వారికి ఈ రాజ్యంలో వాటా లేదు. అన్ని రంగాల్లో వారు వెనుకబడ్డారు. అగ్రవర్ణ పెత్తందారుల ఆధిపత్యమే కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో ఇటీవల బీసీ,ఎస్సీ, ఎస్టీ హక్కులు, రాజ్యాధికార జేఏసీ మరియు ధర్మ సమాజ పార్టీ ఆధ్వర్యంలో 'మాభూమి' పేరుతో లక్ష కిలోమీటర్ల రథయాత్ర కార్యక్రమం అదిలాబాద్ జిల్లా కేంద్రంలో ప్రారంభమైనది. దీన్ని డాక్టర్ విశారదన్ మహారాజు గారు ఏప్రిల్ 14, 2025 అంబేద్కర్ జయంతి రోజున శ్రీకారం చుట్టారు. ఈ యాత్ర ప్రధాన ఉద్దేశం కూడా ఆనాడు కొమురం భీమ్ సాగించిన భూ పోరాటం మరియు సామాజిక సమస్యల పరిష్కారం దిశగానే కొనసాగుతుంది.

**(ఇంద్రవెల్లి ఘటనకు 45 ఏళ్లు సందర్భంగా..)**

**- సంపతి రమేష్ మహారాజ్**
7989578428

# ఆధునిక యువభారత స్వాప్నికుడు 'నారా'

భారతదేశ రాజకీయ రణరంగంలో అలుపెరుగని బాటసారి, రాజకీయ చతురుడు, అత్యధిక కాలం పాటు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రి, అసెంబ్లీ ప్రతిపక్ష నాయకుడిగా సేవలు అందించిన రైతు బిడ్డ ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ సిఎం నారా చంద్రబాబు నాయుడు. 20 ఏప్రిల్ 1950 రోజున ఏపీ రాష్ట్ర తిరుపతి సమీప చిన్న గ్రామం నారావారిపల్లిలో అమ్మనమ్మ-కార్జిన నాయుడు దంపతులకు జన్మించిన నారా చంద్రబాబు నాయుడు శేషాపురంలో ప్రాథమిక పాఠశాల, చంద్రగిరిలో ఉన్నత పాఠశాల, 1972లో శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల నుంచి బి ఏ, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ నుంచి ఎకనమిక్స్‌లో ఎం ఏ పట్టా పొందారు. కళాశాల విద్యార్థిగా నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకొని విద్యార్థి యూనియన్ లీడర్‌గా రుజువు చేసుకొని యూత్ కాంగ్రెస్ నాయకుడిగా రాజకీయరంగ ప్రవేశం చేశారు.

యువజన కాంగ్రెస్ నాయకుడిగా:


1975 ఎమర్జెన్సీ కాలంలో సంజయ్ గాంధీతో దగ్గరి సంబంధాలను కలిగి కాంగ్రెస్ ముఖ్య నాయకుల దృష్టిని ఆకర్షించారు. 1978 - 83 మధ్య కాంగ్రెస్ నుంచి చంద్రగిరి నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికైనారు. తర్వాత కొద్దికాలం పాటు రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థకు డైరెక్టర్‌గా, తర్వాత తన 28వ ఏటనే రాష్ట్ర సినిమాటోగ్రఫీ, సాంకేతిక విద్య, పశు సంవర్ధకశాఖ, పాడి పరిశ్రమ, చిన్న తరహా నీటి పారుదలశాఖ మంత్రిగా పదవిని చేపట్టారు. చంద్రబాబు సినిమాటోగ్రఫీ మంత్రిగా ఉన్నప్పుడే 1981లో ఎన్‌టిఆర్ కుమార్తె భువనేశ్వరీని వివాహమాడారు.

తెలుగు దేశం పార్టీ నాయకుడిగా సేవలు:

ఆంధ్రప్రదేశ్‌ను ఏకపక్షంగా పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా 1982లో ఎన్‌టిఆర్ స్థాపించిన తెలుగు దేశం పార్టీ జోరులో 1983లో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించి ఎన్‌టిఆర్ తెలుగు దేశం ప్రభుత్వం ఏర్పడడం, ఆ ప్రభంజనంలో హేమాహేమీలందరు ఎన్నికలో ఓడిపోయారు. ఆ సమయంలో కాంగ్రెస్ అభ్యర్థిగా నారా చంద్రబాబు కూడా ఓడిపోయారు. ఎన్‌టిఆర్ నాయకత్వంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కాంగ్రెస్ పార్టీని వదిలి తెలుగు దేశం పార్టీలో చేరారు చంద్రబాబు. టిడిపీలో చేరిన చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీ విధివిధానాల రూపకల్పనలో చురుకైన భూమికను నిర్వహిస్తూ పార్టీ తెర వెనుక సూపర్ పవర్ స్థాయికి ఎదిగి పోతూ 1985లో పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. 1984లో తెలుగుదేశం ప్రధాన నాయకులు నాదెండ్ల భాస్కర్ రావుతో చేతులు కలిపిన కాంగ్రెస్ ఎన్‌టిఆర్‌కు వ్యతిరేకంగా దొడ్డిదారిలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, ఈ సందర్భంలో నారా చంద్రబాబు నాయుడు తన రాజకీయ చతురతను ప్రదర్శించి 31 రోజుల్లో తిరిగి ఎన్‌టిఆర్ ప్రభుత్వాన్ని ఏర్పరచగలిగారు. 1989లో జరిగిన ఎన్నికల్లో చంద్రబాబు ఎంఎల్‌ఏగా గెలిచినప్పటికీ మెజారిటీ సాధించని కారణంగా తెలుగు దేశం పార్టీ ప్రతిపక్షనాయకుడిగా చంద్రబాబు నాయుడు సేవలు అందించారు.

అత్యధిక కాలం పాటు ముఖ్యమంత్రిగా విశిష్ట సేవలు:

1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపీ గెలవడంతో ఎన్‌టిఆర్



తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. లక్ష్మి పార్వతిని ఎన్‌టిఆర్ వివాహమాడడం, పాలనలో ఆమె జోక్యం పెరగడంతో మామపై తిరుగుబాటు చేసి 1995లో మొదటి సారి సిఎంగా పదవి చేపట్టడంతో మొదలైన రాజకీయ చాతుర్యం దేశ రాజకీయాలలోనే సంచలనం కలిగించారు. 1995-2004 మధ్య 9 ఏండ్ల పాటు (1999 ఎన్నికల విజయం) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సిఎంగా పని చేస్తూ హైదరాబాదులో ఐటీ రంగానికి పునాదులు వేయడం ప్రారంభించారు. నాటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్, యూకె ఒకప్రధానాంశం టోనీ బ్లేయిర్లను హైదరాబాదుకు రప్పించిన సమావేశం ఏర్పాటు చేసి సంచలనం సృష్టించడా ప్రపంచ దృష్టిని సహితం ఆకర్షించగలిగారు. నాటి ఆంధ్రప్రదేశ్ను భారత దేశ సరి కొత్త సమాచార-సాంకేతిక కేంద్రంగా మార్చగలిగారు. విజన్ 2020 పేరుతో తక్కువ ఖర్చుతో విద్య, వైద్యం, గ్రామీణ ఉపాధి, పారిశ్రామిక అభివృద్ధిని పరుగులెత్తించగలిగారు. సాగుబడి లాభసాటి కాదనే నినాదంతో 2004 ఎన్నికల్లో రైతుల ఆక్రోశంతో ఘోరంగా ఓటమి చవి చూడడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో ఇతర పార్టీలతో కలిసి గెలిసి తొలి ఏపీ సిఎంగా పదవిని చేపట్టారు. 2019 ఎన్నికల్లో జగన్ మోహన్ రెడ్డి నాయకత్వాన వైఎస్ఆర్ పార్టీ చేతుల్లో ఓటమి చవి చూసారు. ఇటీవల 2024లో జరిగిన ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, జనసేన కూటమితో టీడీపీ గెలిచి మరో మారు ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణం చేసి రాష్ట్రంలో అభివృద్ధిని పరుగులెత్తించే ప్రయత్నాలు చేస్తున్నారు.

చంద్రబాబునాయుడును వరించిన పురస్కారాలు, చుట్టు ముట్టిన వివాదాలు:

28వ ఏటనే శాసనసభ సభ్యుడిగా, మంత్రిగా పని చేసిన చంద్రుడు ఉమ్మడి ఏపీకి అత్యధిక కాలం సిఎంగా సేవలు అందించారు. విభజన తర్వాత ఏపీ తొలి సిఎంగా ఎన్నికై తనదైన పాలనను కొనసాగించగలిగారు. ఏపీ అసెంబ్లీ ప్రతి పక్షనాయకుడిగా పని చేసిన నాయుడు సౌత్ ఏసియన్ ఆఫ్ ది ఇయర్, ఐటి ఇండియన్ ఆఫ్ ది మిలినియం, బిజినెస్ పర్సన్ ఆఫ్ ది ఇయర్, సిఈఓ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఆదర్శ సిఎం, ట్రాన్స్‌ఫార్మాటివ్ సిఎం లాంటి పలు పురస్కారాలు/గుర్తింపులు పొందిన నారా చంద్రబాబు నాయుడు పలు సందర్భాల్లో గాఢమైన విమర్శలు, వివాదాలను కూడా ఎదుర్కొన్నారు. ఓటుకు నోటు కేసు,టీటీడీ బోర్డు అవకతవకలు, స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ లాంటి వివాదాలను ఎదుర్కొంటూనే, రెండు వారాల పాటు రిమాండ్ విధింపును సహితం అనుభవించారు. బాబుకు ఏకైక సంతానంగా నారా లోకేశ్ ప్రస్తుతం ఏపీ మంత్రిగా కొనసాగుతున్నారు.

సుధీర్ఘకాలం ముఖ్య మంత్రిగా విశిష్ట సేవలు అందించిన చంద్రబాబు, హైదరాబాదును సైబరాబాదు టవర్‌గా, భారత ఐటి హబ్‌గా మార్చడానికి చేసిన కృషి వల్ల తనదైన ప్రత్యేకతను చాటుకున్నారు. వయస్సుకు సంబంధించిన సమస్యలను అధిగమిస్తూ నేటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అగ్ర స్థానంలో నిలుపడానికి బీజేపీతో కలిసి పావులు కదుపుతూనే, అమరావతి కేంద్రంగా రాష్ట్ర సుస్థిరాభివృద్ధిని పరుగులు పెట్టించేందుకు విశ్వ ప్రయత్నాలను చేస్తున్నారు.

**(20 ఏప్రిల్ నారా చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా)**

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# సమానత్వమా? నువ్వెక్కడ!



దేశ జనాభాలో సగ భాగం ఉన్న మహిళలు పురుషులతో పాటు సమానమేనని భారత రాజ్యాంగం చెబుతోంది. సమాన అవకాశాలు కల్పిస్తామని పాలకులు తరచూ చెప్తుంటారు. కాని వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నాయని వరల్డ్ ఎకనామిక్ ఫోరం నివేదికలో తేలింది. ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే సమానత్వం కోసం మహిళలు వందేల్లు నిరీక్షించాలని అంతే కాకుండా స్త్రీ,పురుష అసమానతలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. 2006 నుంచి పోలిస్తే ఈ ఏడాది స్త్రీ,పురుషుల అసమానతలు పెరిగాయని ప్రపంచ ఆర్థిక ఫోరం తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా 144 దేశాల్లోని విద్య, వైద్య,రాజకీయ, ఆర్థిక విషయాల్లో మహిళల భాగస్వామ్యంపై అధ్యయనం చేసిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమగ్ర నివేదికను రూపొందించింది. మగవాళ్ళకు వున్న అవకాశాల్లో స్త్రీలకు కేవలం 68 శాతం మాత్రమే ఉన్నాయని నివేదికతెలిపింది.

వివక్షత, శ్రమ దోపిడీ, లింగ అసమానతలు స్త్రీల పాలిట శాపమైంది. స్త్రీలను కేవలం సెక్స్ సింబల్‌గా చూసే వాతావరణం చోటు చేసుకోవడం. స్త్రీలను రెండవ తరగతి పౌరులుగా గుర్తించే స్థితి నెలకొనడం ఆందోళన కలిగిస్తోందని ఆ నివేదిక స్పష్టం చేసింది. బడిలో చదువుకునే చోట పాఠ్యపుస్తకాలలో లింగ వివక్షతపై పాఠ్యాంశాలు చోటు చేసుకున్నాయని తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లో పురుషులతో పాటు మహిళలు సమానంగా అభివృధి కావాలంటే మరో 83 ఏళ్లు పడుతుందని 2016సంవత్సరంలో అంచనా వేశారు. ప్రభుత్వాలు చేపట్టిన చర్యల వల్ల విద్య, ఆరోగ్యం విషయంలో మహిళల పరిస్థితి కొంత మెరుగ్గానే ఉంది. కానీ ఆర్థిక, రాజకీయ విషయాలు ఆశించినంతగా మెరుగుపడలేదు. ప్రపంచ వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది అని తేలింది. ఉద్యోగ రంగంలో సమానత్వం రావాలంటే మహిళలు 217 యేళ్లు ఎదిరిచూడాలని అప్పటి పరిస్థితులు స్త్రీ, పురుష సమానత్వ సాధనలో కీలక పాత్ర పోషిస్తాయని వరల్డ్ ఎకనామిక్ ఫోరం తెలిపింది. ప్రపంచ దేశాలలో స్త్రీ పురుషుల అసమానతలు ఎక్కువగా వున్నాయి. అభివృధి చెందిన దేశాలతో పోలిస్తే అభివృద్ధి చెందుతున్న వర్ధమాన దేశాలలో స్త్రీలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో పోటీ పడుతున్నప్పటికీ ఉపాధి, ఉద్యోగ,ఆర్థిక, రాజకీయ రంగాలలో తీవ్ర వివక్షతను ఎదుర్కొంటున్నారు. మన పొరుగు దేశాలైన బంగ్లాదేశ్, చైనాలో స్త్రీల పరిస్థితి మన దేశం లోకన్నా మెరుగుగా వుంది. మహిళలకు గోవా సురక్షిత ప్రాంతమని బీహారులో, స్త్రీలకు రక్షణ తక్కువ వుందని ఫోరం తెలిపింది.

దేశంలోని మహిళా ఆరోగ్యం విషయంలో కేరళ ప్రథమ స్థానంలో వుండగా సిక్కిం తమిళనాడు, కర్ణాటక, ఏపీ, గోవా, మహారాష్ట్ర తర్వాత స్థానాల్లో వున్నాయి. విద్య,వైద్య,ఆర్థిక రంగంలో తెలంగాణ11వస్థానంలో ఉండగా, ఏపి12 స్థానంలో వున్నది. సమాన పనికి సమానవేతన విధానంఅమలులో లేకపోవడం వల్ల స్త్రీ పురుషుల వేతనాల్లో వివక్ష చూపిస్తున్నారని ఫోరం నివేదికలో తెలిపింది. మహిళలు చేసే ఇంటి పనికి విలువ కట్టడం లేదు. ప్రజల ఆలోచన విధానం మారాలి. ప్రభుత్వం నూతన విద్యావిధానంలో మహిల పట్ల గౌరవం మహిళా సాధికారిత మహిళా స్థాయిని పెంచే పాఠ్యాంశాలు విద్యా సంస్థల్లో ప్రవేశ పెట్టాలి. ప్రభుత్వం బాల్య దశ నుంచే కుటుంబంలో సమాజంలో మహిళల పట్ల గౌరవం పెంచే చర్యలు చేపట్టాలి. చైతన్య సదస్సులు నిర్వహించాలి. మహిళా హక్కుల రక్షణ, భద్రత చట్టాల మీద మహిళా సంఘాలకు అవగాహనచైతన్య సదస్సులు నిర్వహించాలి. యూనివర్సిటీల్లో మహిళా అధ్యయన పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేయాలి. కేంద్ర రాష్ట్ర స్థానిక ప్రభుత్వాలు మహిళా సాధికారిత మహిళా హక్కుల రక్షణే మానవ హక్కుల రక్షణ లక్ష్యంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు స్త్రీ పురుషులకు సమాన అవకాశాలు కల్పించాలి. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించాలి. దేశ రాజకీయాలలో చట్ట సభల్లో మహిళలకు రిజర్వేజన్స్ ప్రవేశ పెట్టి మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించాలి. మానవాభివృద్ధి సాధనలో మహిళాభ్యుదయానికి పెద్దపీట వెయ్యాలి.

**- నేదునూరి కనకయ్య**
9440245771

## ఎర్ర శాలువా...

దినమంతా కంపు కొట్టే
అశుద్ధ వార్తా వాసనలు చూసీ చూసీ
ఇక లాభం లేదనీ
మనసును ప్రయాణ చక్రాలకు ముడేసా
వారాంతంలో అక్కడికి వెళ్ళా
అదే..సుందరయ్య విజ్ఞాన కేంద్రం
సమూహం వెల్లివిరిసింది
లౌకికత్వం కోడై కూసింది
సాహిత్య సౌరభాలు ఏకధాటిగా
పీల్చుకుని.. ఊపిర్లాదుకున్నాను
పంకాగాలి కాస్త తగులుతున్న
సీటొక్కటి చూసుకుని
కూలబడి పోయాను.. కూసిన్ని నీళ్ళు తాగి
కవి దిగ్గజాల వాక్ ఝరికీ
నన్ను నేను కోల్పోతున్న తరుణంలో
నా పక్కనే పరుచుకున్న ఎర్ర శాలువా
నన్ను తాకుతూ మందలించింది
ఎవరైనా కుర్చీ కోసం వేసారో.....
ఎవరి నుంచైనా అదే జారిపోయిందో...
దాని పూర్వ కథ తెలియదు కానీ
మదిలో మనో నేత్రాన్ని తట్టింది
దాన్ని మరింతగా తడిమి చూసా
ఎన్నో చెమట చుక్కలు.. మరెన్నో కన్నీటి లెక్కలు
దాని మడతల్లో దాగున్నట్టనిపించింది
గుప్పుమన్న అక్షరాల వాసనొచ్చింది
మోసిన..రాసిన సాహిత్య పుస్తకాల
కీర్తినంతా అదే చుట్టేసుకున్నట్టనిపించింది
వస్త్రం ఓ గొప్ప సంకేతం సుమా..
అరుణ వర్ణంతో గుండెనెంత మండిస్తొందో
ఎన్ని విప్లవ భావాలు అందులో
పోగులు పోగులుగా పొదగ బడ్డాయో
ఆ ఎర్ర శాలువాను నాతో
తెచ్చేసుకుందాం అనుకున్నా... కానీ..
పురా స్మృతుల్ని కప్పుకున్న అది
నాకెంతో బరువనిపించింది
బాధ్యతాయుతమైన వలువనిపించింది
వందనాలతో
దాన్నక్కడే వొదిలి కదిలా..!

**- డా. కటుకోఝ్వల రమేష్**
9949083327

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు. - ఎడిటర్**

# హిందూ మహాగ్రంథాలకు యునెస్కో గుర్తింపు!



ప్రపంచ వారసత్వ దినం లేదా అంతర్జాతీయ జ్ఞాపక చిహ్నాలు, ప్రదేశాల దినం సందర్భంగా 18 ఏప్రిల్ 2025 రోజున యునెస్కో మెమొరీ ఆఫ్ ది వరల్డ్ రిజిస్టర్ జాబితాలో మన భారత దేశానికే గర్వకారణమైన భగవద్గీత, భరతముని రచించిన నాట్యశాస్త్రం చోటు దక్కడం సంతోషాన్ని కలిగించింది. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా 72 దేశాలకు/ఇతర అంతర్జాతీయ సంస్థలకు చెందిన 74 రాతప్రతులను ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో చేర్చడం, అందులో 2 మన గ్రంథాలు చోటు దక్కించుకోవడం సముచితంగా ఉన్నది. వీటితో కలిపి ఇప్పటి వరకు 570 రాతప్రతులు లేదా సంస్థలు యునెస్కో జాబితాలో చోటు దక్కించుకున్నాయి. హిందూ మతానికి చెందిన ఏకైక అద్భుతమైన ఆధ్యాత్మిక గ్రంథం. మహాభారతంలో భాగంగా రాయబడిందనీ దాదాపు 5వేల సంవత్సరాల క్రితం చెప్పబడిన భగవద్గీత మన జీవన విలువలను భగవంతుడే కృష్ణుడి రూపంలో బోధించిన జీవిత పాఠం. వేద వ్యాసుడు సంస్కృతంలో రచించిన మహాభారత ఇతిహాసంలోని భీష్మ పర్వం 25వ అధ్యాయం మొదలు 42వ అధ్యాయం వరకూ 18 అధ్యాయాలు 700 శ్లోకాలుగా భగవద్గీత చెప్పబడింది. భగవంతుడి ఉపదేశమే భగవద్గీత పవిత్ర గ్రంథంగా హిందూ సమాజాన్ని నిత్యం జాగృత పరుస్తున్నది. సాక్షాత్తు కృష్ణ భగవానుడే తన శిష్యుడైన అర్జునుడికి బోధించిన జ్ఞానమే గీతోపనిషత్తు లేదా గీతగా కూడా బహుళ ప్రచారం పొందింది. ఉపనిషత్తుల సారం, కర్తవ్యనిర్వహణ పాఠం, పాపహరణకు మార్గమని విశ్వసిస్తూ భగవద్గీతను ఆచరించడం కొనసాగుతోంది. భగవద్గీతలో 18 అధ్యాయాలు లేదా యోగాలు ఉండగా, వాటిలో 1-6 వరకు కర్మషట్కము, 7-12 వరకు భక్తిషట్కము, 13 - 18 వరకు జ్ఞాన షట్కము అని పిలుస్తారు. భగవద్గీతలోని 18 యోగాల్లో అర్జున, సాంఖ్య, కర్మ, జ్ఞాన, కర్మసన్యాస, ఆత్మసంతృప్తిని, జ్ఞానవిజ్ఞాన, అక్షర పరబ్రహ్మ, రాజవిద్యా రాజగుహ్య, విభూతి, విశ్వరూప్, భక్తియోగ, క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ, గుణత్రయవిభాగ, పురుషోత్తమప్రాప్తి, దైవాసుర



సంపద్విభాగ, శ్రద్ధాత్రయ విభాగ, మోక్షసన్యాస యోగాలు ఉన్నాయి. భారత్ దేశ భాషలతో పాటు అనేక విదేశీ భాషల్లో కూడా అనువదించబడిన భగవద్గీత చూపిన మార్గాన్ని ఎంచుకున్న గాంధీ, రామకృష్ణ పరమహంస, వివేకానంద లాంటి మేధావులు మనకు నిత్యం ప్రేరణగా నిలుస్తున్నారు. యునెస్కో మెమొరీ ఆఫ్ ది వరల్డ్ జాబితాలో చోటు దక్కించుకున్న నాట్యశాస్త్రాన్ని నాట్యవేదంగా కూడా పిలుస్తున్నారు. శాస్త్రీయ, సాంస్కృతిక కళలకు సంబంధించిన అన్ని అంశాలను కలిగి ఉన్న వివరణాత్మక గ్రంథం భారత నాట్యశాస్త్రం. మహర్షి భరతుడు రచించాడు. నాట్య విద్యలో వెలువడిన అఖిల గ్రంథాల్లోకి ప్రమాణమైనది నాట్యశాస్త్రం. నాట్యశాస్త్రంలో 36 అధ్యాయాలు, 6000 శ్లోకాలు ఉన్నాయి.

నాట్యానికి ప్రయోజనాలు అనేకం.అన్నింటిలోకి మహారసమే నాట్యశాస్త్ర ప్రధాన ప్రయోజనం. నాట్యశాస్త్ర గ్రంథంలో వేదిక నిర్మాణం, భావ-రస సిద్ధాంతం, భావ వ్యక్తీకరణ, నటనా శైలులు, శరీర కదలికలు లేదా అభినయం, అలంకరణ-దుస్తులు, కళా దర్శకుడి పాత్ర, సంగీత వాయిద్యాలు, కళతో సంగీతాన్ని ఏకీకృతం చేయడం లాంటి ప్రధాన అంశాలు ఉన్నాయి. అన్ని కాలాలకు అనుగుణంగా ఉన్న ఈ మహాగ్రంథాల నుంచి ప్రపంచ మానవాళి ఎన్నో జీవన విలువను నేర్చుకోవలసి ఉన్నది. హిందువులకు గర్వకారణంగా నిలుస్తున్న భగవద్గీత, నాట్యశాస్త్ర లోతులను తెలుసుకొని, జీవన సన్మార్గాన్ని ఎంచుకొని మోక్షం పొందడానికి మనవజాతి పాటు పడాలి. మన సంస్కృతి సంప్రదాయాలను, వారసత్వ సంపదలను కాపాడుకుంటూ ఇతిహాసాల నుంచి ముక్తి మార్గాలను తెలుసుకుంటూ జీవనయానం చేద్దాం.

# నంద్యాల జిల్లా ఫారెస్ట్ శాఖలో ప్రకంపనలు

**మహానంది,ఏప్రిల్19,మనంన్యూస్:** నంద్యాల జిల్లా కేంద్రంలోని ఫారెస్ట్( అటవీ) శాఖలో ఒక వివాదాస్పద అధికారిపై రాష్ట్ర స్థాయిలో ఒక కేసుకు సంబంధించి ప్రకంపనలు సృష్టిస్తున్నట్లు విశ్వాసనీయ సమాచారం. ఉమ్మడి కడప జిల్లాలోని మైదుకూరు మండలంలోని వనిపెంట చెక్ పోస్ట్ పై ఏసీబీ అధికారులు 2021 సంవత్సరం జనవరి 29న దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగానే రికార్డుల్లో నమోదైన ప్రకారం 49. 699 టన్నుల ఎర్రచందనం మాయమైనట్లు గుర్తించారు. దీనిపై ఇటీవల అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కొంతమంది అధికారులపై అభియోగాలు నమోదుకు ఆదేశించారు. అప్పట్లో అక్కడ పనిచేసిన ఒక అధికారి ప్రస్తుతం నంద్యాల అటవీ శాఖ పరిధిలో ఓ డివిజన్లో పనిచేస్తున్నట్టు తెలుస్తుంది. సదరు అధికారిపై కేసు నమోదు అయిందని వార్త వెలుగులోనికి రావడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే సదరు



అధికారిపై పలు అవినీతి ఆరోపణలు వెలువెత్తుతున్నట్లు తెలుస్తుంది. తన వద్ద పనిచేసే క్రింది స్థాయి మహిళా ఉద్యోగులపై వివక్షత చూపించడమే కాక పలు రకాలుగా వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. గతంలో ఒకసారి ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించిన సందర్భంలో లంచం వ్యవహారంలో క్రింది స్థాయి సిబ్బంది నీ బలి పశువు చేసినట్లు సమాచారం. అక్కడ ఏం చేసినా చెల్లుబాటు అయిందని ఇక్కడ కూడా అది చేస్తే చెల్లుబాటు అవుతుంది అనే ధోరణిలో వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నంద్యాల డివిజన్లో కూడా అక్రమాలకు పాల్పడడంతో పాటు అక్రమ వసూళ్లకు తెర లేపారు అనేది విస్తృతంగా ప్రచారం జరుగుతున్నట్లు తెలుస్తుంది. మహానందిలో గత కొన్ని నెలల క్రితం కొందరి నిందితులను అరెస్టు చేసే క్రమంలో ఆ అధికారి వ్యవహరించిన తీరు వివాదాస్పదంగా మారింది. అటవీ శాఖ సిబ్బందితోపాటు, తనపై దాడి జరిగిన కూడా కేసు నమోదు చేయకుండా ఉండడం అత్యంత వివాదాస్పదంగా మారింది. వీటన్నింటికీ కారణం సుంకంబులు సమర్పయామి వ్యవహారం లో భాగమేనని పలువురు భావిస్తున్నట్లు ప్రచారం. వక్రబుద్ధి మారని అధికార నేటికి కూడా తనదైన శైలిలో క్రింది స్థాయి మహిళా ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత కొన్ని నెలల క్రితం మహానంది క్షేత్రానికి దైవ దర్శనార్థమై ఒక రాష్ట్ర స్థాయి అటవీ శాఖ అత్యున్నత అధికారి రాగా అంటి ముట్టనట్లు వ్యవహరించడం తీవ్ర విమర్శ లతోపాటు తో పాటు దుమారం రేపింది. ఎర్రచందనం దుంగలు మాయం అవడం వ్యవహారంలో కూడా కర్త, కర్మ, క్రియ ఆ అధికారి అని అటవీ శాఖ వర్గాల్లో గుసగుసలు వినవస్తున్నాయి. వేయి రా బంధువులను తిన్న గద్ద ఒక్క గాలివానకు దెబ్బతినింది అన్న చందనంగా అధికారి పరిస్థితి తయారైనట్లు అటవీశాఖ వర్గాల్లో చర్చ మొదలైనట్లు సమాచారం. లక్షలాది రూపాయల ప్రభుత్వ సొమ్ము మాయం అవడం అందులో కొందరు అటవీశాఖ అధికారులు తో పాటు అక్కడ నుండి బదిలీపై వచ్చిన ప్రస్తుతం నంద్యాల అటవీశాఖ కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న ఆ అధికారిపై అందరి చూపు పడినట్లు సమాచారం. అవినీతి అక్రమాలకు పాల్పడిన వారిని బదిలీ చేస్తారా, లేక అభియోగాలు నమోదు అయిన తర్వాత అరెస్టులు ఉంటాయా అనేదానిపై అటవీ శాఖ వర్గంలో ఉత్కంఠ నెలకొన్నట్లు తెలుస్తుంది.

## సామెల్ భార్య చనిపోవడం చాలా బాధాకరం



- మాజీ సర్పంచ్ చంద్రయ్య

**కౌతాళం ఏప్రిల్ 19 మనం న్యూస్:** కౌతాళం మండల పరిధిలోనే కాత్రికి గ్రామంలో టిడిపి కార్యకర్త సామేల్ భార్య చనిపోవడం చాలా బాధాకరమైన విషయం,అని సామెల్ కుటుంబానికి ధైర్యం చెబుతూ కాత్రికి గ్రామ నాయకులు ఎన్.చంద్రయ్య, బి.మారెప్ప, ఈరన్న,పొంపన్న తాత, ఆమె మట్టి ఖర్చులకు ఆర్థిక సహాయం చేయడం జరిగిందని వారు తెలిపారు.

## స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర

### కాలనీ రోడ్లపై చెత్త లేకుండా శుభ్రంగా ఉంచుదాం ఆరోగ్యాన్ని కాపాడుకుందాం



- నగర కమిషనర్ హరిప్రసాద్

**బేతంచేర్ల, ఏప్రిల్ 19(మనం న్యూస్):** పట్టణంలో నగర కమిషనర్ హరి ప్రసాద్ ఎంపీడీవో ఫజల్ రెహమాన్ తాసిల్దార్ ప్రకాష్ బాబు ఆధ్వర్యంలో నగర పంచాయతీ నుండి ర్యాలీగా కొత్త బస్టాండ్ ఏరియాలోని ఎమ్మార్వో ఆఫీస్ రోడ్డులో గల కాలనీ యందు వీధి ప్రజలకు తడి చెత్త పొడి చెత్త హానికరమైన చెత్త మొదలగు వాటిపైన అవగాహన కల్పిస్తూ మరియు ఇతర పాడైపోయిన ఎలక్ట్రికల్ వస్తువులు అనగా టీవీలు ఫ్యాన్లు కంప్యూటర్లు మొదలగు వాటిని చెత్త కుండీలలో వేయకుండా బేతచర్ల నరపంచేది కార్యాలయంలోని ఆర్ఆర్ సెంటర్ నందు అందజేయాలని తెలియజేశారు మరియు వెదజల్లే నారా పంచాయతీ యందు గల ఆర్ఆర్ ఆర్ సెంటర్ ప్రారంభించి ప్రజలు స్వచ్ఛందంగా తెచ్చిన పాడైపోయిన టీవీలు కంప్యూటర్ మొదలగు వాటిని ఉంచడమైనది ఈ కార్యక్రమం లో హెల్త్ డిపార్ట్మెంట్ మలేరియా డిపార్ట్మెంట్ గౌరవ కౌన్సిల్ సభ్యులు కార్యాలయ సిబ్బంది ఆశ వర్కర్లు మెప్మా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలు ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా

- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్



**కర్నూలు ఏప్రిల్ 19(మనం న్యూస్):** కర్నూలు ప్రభుత్వాసుపత్రిని అభివృద్ధి చేసేందుకు శాయశక్తుల కృషి చేస్తున్నానని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. స్టేట్ క్యాన్సర్ ఇన్ స్టిట్యూట్లో లీనియర్ యాక్సిలరేటర్, సి.టి సిమ్యులేటర్, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, మెడికల్ ఆంకాలజీ వార్డులను మంత్రి సత్య కుమార్ యాదవ్ తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి టి.జి భరత్ మాట్లాడారు. క్యాన్సర్ ఆసుపత్రిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేశానన్నారు. ఆసుపత్రిలో అన్ని విభాగాల్లో మెరుగైన సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కర్నూల్ మెడికల్ కాలేజీకి ఎంతో చరిత్ర ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది పేరొందిన డాక్టర్లు కర్నూల్ మెడికల్ కాలేజీలోనే చదివారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన సేవలు అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తన శాఖకు పూర్తిస్థాయిలో న్యాయం చేసేందుకు మంత్రి సత్య కుమార్ యాదవ్ ఎంతో కష్టపడుతున్నారన్నారు. కార్పొరేట్ హాస్పిటల్ కు దీటుగా కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలందించేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిని నెలకు లేదా రెండు నెలలకు ఒకసారి తప్పకుండా విజిట్ చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని.. మంత్రి టి.జి భరత్ కోరారు.

## పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ




**బేతంచేర్ల,ఏప్రిల్ 19(మనంన్యూస్):** మండల పట్టణ క్రైస్తవులు ఈస్టర్ పండుగను సందర్భంగా రన్ ఫర్ జీసస్ ర్యాలీని నిర్వహించారు పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు దాసన్న కార్యదర్శి పాస్టర్ డివిఎస్.ప్రసాద్ ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించారు యేసుక్రీస్తు మరణ పునరుద్ధానాల గురించి వివరిస్తూ పట్టణములోని పురవీధుల గుండా ర్యాలీని కొనసాగించారు అధ్యక్షులు దాసన్న మాట్లాడుతూ మనుషుల పాపములను తీసివేయుటకు యేసు క్రీస్తు శిలువపై మరణించి మూడవ రోజున తిరిగి లేచారని తెలియపరిచారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పాస్టర్ సామేలు పాస్టర్లు ఆనంద్ మల్లేష్ బాబు రాజశేఖర్ కుమార్ ప్రభుదాసు మార్కు మరియు క్రైస్తవ ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు

- చేతి పంపు బోరు రిపేరు కాలనీలో నీటి సమస్య పరిష్కారం

**బేతంచేర్ల, ఏప్రిల్ 19(మనంన్యూస్):** పట్టణంలో 18 వార్డ్ నందు అగ్రికల్చర్ ఆఫీస్ లైన్ 3 సంవత్సరాల నుండి నిరుప్రయోగంగా ఉన్న చేతిపంపు బోరును రిపేరు చేయించిన తెలుగుదేశం పార్టీ నాయకులు స్థానిక టిడిపి నాయకులు మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని కాలనీలో ఉన్న చేతిపంపు బోరు రిపేరు చేయిస్తే కాలనీ వాసులకు నీటి సమస్య లేకుండా ఉంటుందని ఎమ్మెల్యే డోన్ శాసన సభ సభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే వెంటనే స్పందించి సంబంధిత అధికారులను పంపించి చేతిపంపు బోరును రిపేరు చేయించడం జరిగిందని వారన్నారు కాలనీవాసులు మాట్లాడుతూ నాటి పాలకులు నీటి సమస్య ఎండాకాలంలో ఎక్కువ అవుతుందని చేతిపంపు బోరు రిపేరు చేస్తే బాగుంటుందని ఎన్నిసార్లు విన్నవించుకున్న పట్టించుకున్న పాపాన పోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఎమ్మెల్యే నీటి సమస్యను తెలియజేసిన వెంటనే స్పందించి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేయడం తో కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు.



## ఏసుక్రీస్తు లోకానికి వెలుగై ఉన్నాడు: సోమ సుందరం




**కర్నూల్ ఏప్రిల్ 19 (మనం న్యూస్):** ఏసుక్రీస్తు దేవుడు లోకానికి వెలుగై యున్నాడని ప్రజా అధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నాయకులు సోమ సుందరం కొనియాడారు .ఈ సందర్భంగా శనివారం గుడ్ ఫ్రైడే పండుగ పురస్కరించుకొని కర్నూల్ నగరంలో శనివారం గుడ్ ఫ్రైడే శుభ సందర్భంగా కోల్స్ చర్చి నుండి కర్నూల్ కోల్స్ సెంట్రింగ్ బాప్టిస్ట్ చర్చి నుండి రన్ ఫర్ జీసస్ కార్యక్రమానికి ఓపెనింగ్ చేయడం కోసం కర్నూల్ పార్లమెంట్ ఎంపీ అయినటువంటి నాగరాజు ముఖ్య అతిథులుగా విచ్చేసి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కర్నూలు నగర కమిషనర్ రవీంద్ర బాబు కార్యక్రమాన్ని హాజరయ్యారు . అంతేకాకుండా వివిధ సంఘాల పాస్టర్లు అందరూ పాల్గొని ర్యాలీని జయప్రదం చేశారు ఈ ర్యాలీలో పాల్గొన్న ప్రజా అధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కార్యదర్శులు నాయకులు సోమ సుందరం ముప్పసాని సుధాకర్ స్వరూప్ కుమార్ రాజీవ్ ఫ్రిచర్ మొదలగువారు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. కావున ఏసుక్రీస్తు ఈ లోకానికి వెలుగై ఉన్నాడని తిరిగి సమాధి చేయబడి తిరిగి లేస్తాడని నమ్మకంతో ఈ ర్యాలీని చేపట్టడం జరిగింది కనుక కర్నూల్ నగర ప్రజలు అయితే మీ జిల్లా ప్రజలయితేనే రాష్ట్ర ప్రజలు అయితేనే యావత్ భారత దేశ విదేశీ ప్రజలందరికి కూడా ఈ యొక్క రన్ ఫర్ జీసస్ శుభ వందనములు తెలియజేయుచున్నాము. ప్రజా అధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నాయకులు సుమ సుందరం ప్రధాన కార్యదర్శి ముప్ప సాని సుధాకర్ నాయకులు సుబ్బయ్య పెద్దయ్య తదితరులు పాల్గొని జయప్రదం చేశారు.

## సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ గా డాక్టర్ తిప్పర్తి యాదయ్య



**రంగారెడ్డి,ఏప్రిల్19(మనం న్యూస్)** హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ స్పెషల్ గ్రేట్ కమిషనర్ వర్గంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ తిప్పర్తి యాదయ్యను శనివారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ సెక్రటరీ సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ గా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వివిధ ఉద్యోగ సంఘ నాయకులు ఇంకా హయత్ నగర్ సర్కిల్ అధికారులు సిబ్బంది కమిషనర్ తిప్పర్తి యాదయ్యకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ దినేష్ సింగ్, సూపర్ ఇంటెండెంట్లు మహేందర్, విక్రమ్, సుధాకర్ రావు, టాక్స్ ఇన్స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొనడం జరిగింది.


## శివరాం మృతి పార్టీకి తీరని లోటు

- వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీ వై ప్రదీప్ రెడ్డి
- శివరాం మృతికి సంతాపం తెలియజేసిన ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

**మంత్రాలయం , ఏప్రిల్ 19, మనం న్యూస్ :-** వైకాపా కార్యకర్త రచ్చుమర్రి శివరాం మృతి పార్టీకి తీరని లోటు అని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు వై. ప్రదీప్ రెడ్డి అన్నారు. శివరాం అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన రచ్చుమర్రి గ్రామానికి చేరుకుని శివరాం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శివరాం మృతి పార్టీకి తీరనిలోటు , పార్టీ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. శివరాం మృతి కి ఎమ్మె ల్యే వై.బాలనాగిరెడ్డి సంతాపం వ్యక్తం. శివరాం సోదరుడు బంగారు బాబుకు పోన్ చేసి పరామర్శించి , అన్ని విధాలుగా అండగా ఉంటామని ధైర్యంగా ఉండలాన్నారు.అలాగే మంత్రాలయం మండల అధ్యక్షులు జి. భీమా రెడ్డి ,మండల ఉపాధ్యక్షులు/ మంత్రాలయం గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య వేరువేరుగా శివరాం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



## తర్తూర్ లక్ష్మీ రంగనాథ స్వామి వారిని దర్శించుకున్నమాండ్ర లింగారెడ్డి



**జూపాడుబంగ్లా, ఏప్రిల్ 19 (మనం న్యూస్):** జూపాడు బంగ్లా మండల కేంద్రంలోని తర్తూర్ గ్రామంలో వెలిసినటువంటి శ్రీ లక్ష్మీ రంగనాథ స్వామి వారిని మాండ్ర లింగారెడ్డి, మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి,దర్శించుకోవడం జరిగినది, ఈ సందర్భంగా లక్ష్మీ రంగనాథ స్వామి ఆలయ ఈవో సాయికుమార్ ఆలయ పూజారులు, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి వారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు అందించారు, ఈ కార్యక్రమంలో నందికొట్కూరు రూరల్ సిఐ సుబ్రహ్మణ్యం, మండల క్లస్టర్ ఇంచార్జ్ గిరీశ్వర్ రెడ్డి, దేవస్థానం కమిటీ చైర్మన్ మందాడి వెంకట రమణారెడ్డి, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్న సేవలో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ సుజయ్ దంపతులు



**శ్రీశైలం, ఏప్రిల్ 19(మనంన్యూస్):** శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ సుజయ్ దంపతులు దర్శించుకున్నారు. శనివారం సాయంత్రం ఆలయ మహాద్వారం వద్ద జస్టిస్ సుజయ్ దంపతులకు ఆలయ మర్యాదలతో అధికారులు అర్చక వేద పండితులు స్వాగతం పలికారు.స్వామి అమ్మ వార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్న అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో వేద పండితులచే జస్టిస్ సంజయ్ దంపతులకు వేదాశీర్వచనం చేయించి స్వామివార్ల చిత్రపటాన్ని అందజేసినట్లు పిఆర్ఓ శ్రీనివాసరావు తెలిపారు.

## పేదలకు సన్న బియ్యం అందజేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ

- 500 రూపాయల బోనస్ తో పెరిగిన సన్నబియ్యం సాగు
- సన్నబియ్యం లబ్ధిదారుని ఇంట్లో భోజనం చేసిన చేసిన మంత్రి తుమ్మల



**ఖమ్మం, ఏప్రిల్ 19(మనం బ్యూరో):** దేశంలో పేదలకు సన్న బియ్యం అందజేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సన్న బియ్యం కార్యక్రమంలో భాగంగా శనివారం రఘునాథపాలెం మండలం బూడిదంపాడు గ్రామంలో లబ్ధిదారుడు గుడిబండ్ల రాజారావు ఇంటిలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పోలీసు కమీషనర్ సునీల్ దత్, జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ డా. పి. శ్రీజ, జెడ్పీ సిఇఓ దీక్షా రైనాతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ కూలీ చేసుకునే కుటుంబం నేడు సంతోషంతో సన్న బియ్యం భోజనం చేస్తున్నారని అన్నారు. గతంలో ప్రభుత్వాలు రేషన్ కార్డుల ద్వారా అందించే దొడ్డు బియ్యం బయట మార్కెట్ లో 10 రూపాయలకు అమ్ముకొని, కూలీ చేసిన డబ్బులతో సన్న బియ్యం కొనుక్కోవాల్సి వచ్చేదని తెలిపారని, ప్రస్తుతం ప్రతి సభ్యునికి ప్రభుత్వం అందించే సన్న బియ్యంతో సంతోషంగా భోజనం చేస్తున్నారని మంత్రి అన్నారు. సన్న బియ్యం పంపిణీ ద్వారా రైతులకు కూడా లాభం జరగాలని ప్రభుత్వం క్వింటాల్ సన్న ధాన్యంపై మద్దతు ధరతో పాటు, 500 రూపాయల బోనస్ చెల్లించి రైతుల నుంచి కొనుగోలు చేసిందని అన్నారు. గతంలో దిగుబడి అధికంగా వస్తుందని రైతులంతా దొడ్డు బియ్యం మాత్రమే సాగు చేసేవారని, నేడు ప్రభుత్వం అందిస్తున్న బోనస్ కారణంగా 20 శాతం ఉన్న సన్న వడ్ల సాగు ఇప్పుడు 80 శాతం వరకు పండిస్తున్నారని అన్నారు. పేదలు కూడా ధనవంతులు లాగా సన్న బియ్యం తినాలనే లక్ష్యంతో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుందని, సన్న బియ్యం పంపిణితో రీసైక్లింగ్ కు అడ్డుకట్ట వేశామని అన్నారు. సన్న బియ్యం పంపిణీ అర్హులకు మాత్రమే అందాలని ఎక్కడా పక్క దారి పట్టకుండా అధికారులు జాగ్రత్త వహించాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం పథకాన్ని పేదలు సక్రమంగా వాడుకోవాలని మంత్రి కోరారు. అంతకుముందు రఘునాథపాలెం మండలం బూడిదంపాడు -పుటాని తండా జెడ్పి రోడ్డు నుంచి వాంకుడో త్ తండా రోడ్డు వరకు 2 కోట్ల 50 లక్షలతో చేపట్టిన బి.టి రోడ్డు నిర్మాణం, బూడిదంపాడు ఎస్సీ కాలనీ నందు 80 లక్షలతో చేపట్టిన అంతర్గత సిసి రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణం, ఆర్ అండ్ బి రోడ్డు నుండి బూడిదంపాడు గ్రామం వరకు రూ. 150 లక్షల అంచనాలతో నిర్మించనున్న అప్రోచ్ రోడ్డు నిర్మాణం పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్బి ఎస్ఇ యుగంధర్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ ప్రక్రియ

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడి
- వీ.సీ ద్వారా కలెక్టర్లతో సమీక్షించిన మంత్రులు ఉత్తమ్ కుమార్, సీతక్క

**నిజామాబాద్, ఏప్రిల్ 19(మనం ప్రతినిధి):** జిల్లాలో నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడించారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లు, తాగునీటి సరఫరాపై పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీ.ఎస్. చౌహాన్ తో కలిసి సంబంధిత శాఖల మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల పరిస్థితి గురించి కలెక్టర్ మంత్రి ఉత్తమ్ కుమార్ దృష్టికి తెచ్చారు. యాసంగిలో జిల్లాలో 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకుని, కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటికే 40 శాతం మేర 3.14 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందని తెలిపారు. ఇందులో సింహభాగం 3.12 లక్షల మెట్రిక్ టన్నులు సన్న ధాన్యం సేకరణ జరిగిందని, దొడ్డు రకం ధాన్యం కేవలం 12 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందని వివరించారు. మే చివరి వారం నాటికి లక్ష్యం మేరకు పూర్తిస్థాయిలో 7లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేలా ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. అదృష్టవశాత్తు జిల్లాలో అకాల వర్షాలు కురియలేదని, ఈ వెసులుబాటును సద్వినియోగం చేసుకుంటూ ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేశామని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంచామని, ప్యాడీ క్లీనర్లు, టార్పలిన్లు, తూకం యంత్రాలు సరిపడా ఉన్నాయని వివరించారు. ప్రతి కేంద్రంలోనూ సన్న ధాన్యం నిర్ధారణకు గ్రెయిన్ క్యాలీపర్లు వినియోగిస్తున్నారని తెలిపారు. ధాన్యం సేకరణ కోసం సుమారు 2 కోట్ల గన్నీ బ్యాగులు అవసరం కాగా, ఇప్పటికే జిల్లాకు కోటీ 20 లక్షల గోనె సంచులు వచ్చాయని, ఎక్కడ కూడా గన్నీ బ్యాగుల కొరత లేదని అన్నారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే నాణ్యత



ప్రమాణాలను పరిశీలించి కొనుగోలు చేస్తున్నామని, ధాన్యం తూకం పూర్తి కాగానే సమగ్ర వివరాలతో రైతులకు రసీదులు అందిస్తున్నామని కలెక్టర్ మంత్రి దృష్టికి తెచ్చారు. రైస్ మిల్లుల వద్ద, కొనుగోలు కేంద్రాలలో ఎక్కడ కూడా ధాన్యం తూకంలో తరుగు పేరిట కోతలు అమలు చేయకుండా పక్కాగా పర్యవేక్షణ జరుపుతున్నామని అన్నారు. కొనుగోలు కేంద్రాల నుండి నిర్ధారిత రైస్ మిల్లులకు వెంటవెంటనే ధాన్యం తరలించేలా సరిపడా సంఖ్యలో లారీలను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. డిఫాల్ట్ లేని రైస్ మిల్లులకు ధాన్యం నిల్వలను కేటాయిస్తూ, మిల్లుల వద్ద కూడా ధాన్యం దిగుమతిలో జాప్యానికి తావులేకుండా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వివరించారు. ధాన్యం విక్రయించిన రైతులకు నిర్ణీత గడువులోపు బిల్లుల చెల్లింపులు జరిగేలా ఎప్పటికప్పుడు టాబ్ ఎంట్రీలు చేయిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం సన్న ధాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయల చొప్పున బోనస్ అందిస్తుండడం వల్ల జిల్లాలో ఈసారి యాసంగిలోనూ సన్నరకం ధాన్యాన్ని 80 శాతానికి పైగా సాగు చేశారని, రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాలకే తమ ధాన్యాన్ని తెస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ మాట్లాడుతూ, ఈ సారి యాసంగిలో దేశంలోనే అత్యధికంగా రికార్డు స్థాయిలో తెలంగాణ రాష్ట్రంలో వరి ధాన్యం సాగు అయ్యిందని అన్నారు. 54.89 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా, 137.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వచ్చాయని వివరించారు. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 8329 కొనుగోలు కేంద్రాల ద్వారా 70.13 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించుకోవడం జరిగిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ధాన్యం సేకరణకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ దాహార్తి సమస్య ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. తాగునీటి అవసరాల కోసం ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి కోటి రూపాయల నిధులను కేటాయించిందని, ఎక్కడైనా తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడితే తక్షణమే మరమ్మతు పనులు జరిపించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఆర్డీఓ సాయాగౌడ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి లో మెరిసిన అమ్ధాపూర్ ఆణిముత్యం



**బోధన్ ఏప్రిల్ 19(మనం న్యూస్):** అమ్ధాపూర్ గ్రామానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ కాలేవార్ లక్ష్మి నారాయణ కుమారుడు కాలేవార్ సంకీర్త్ మాదాపూర్లోని నారాయణ కా లేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. శనివారం విడుదల చేసిన ఈఈ మెయిన్స్ ఫలితాల్లో సంకీర్త్ 99.73 శాతం పర్సెంటైల్ సాధించి, ఆల్ ఇండియా ర్యాంక్ 4000 లోకి ప్రవేశించారు.విద్యార్థి సంకీర్త్ తన ఈ విజయంతో గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సంకీర్త్ కు అభినందనలు తెలియజేశారు.

## ఓలంపిక్స్ మెడల్స్ లక్ష్యంగా ఇందూర్ బిడ్డలు ఎదగాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

**నిజామాబాద్‌స్పోర్ట్స్,ఏప్రిల్ 19 (మనం న్యూస్):** గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన క్రీడా వార్షికోత్సవం 2024-2025 బహుమతుల ప్రధానోత్సవానికి ముఖ్యఅతిథిగా అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్పాల్ మాట్లాడుతు ఇందూర్ జిల్లా అంటేనే క్రీడాకారులకు పెట్టిన పేరని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు ఉండటం మన జిల్లాకు గర్వకారణం అన్నారు.గిరిరాజా కళాశాల విద్యార్థులు క్రీడాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడం తో పాటు ఓలంపిక్స్ లో మెడల్స్ సాధించే విధంగా లక్ష్యం పెట్టుకొని ఉన్నత శిఖరాలకు




ఎదగాలన్నారు.యువత మారకద్రవ్యల, మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా శారీరకంగా, మానసికంగా దృఢంగ ఉండటానికి క్రీడలు అలవాటు చేసుకోవాలన్నారు. ఖేలో ఇండియా, ఫిట్ ఇండియా పేరుతో గ్రామస్థాయి నుండి క్రీడాకారులను ప్రోత్సాహించేల కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు మౌలిక సౌకర్యల కల్పనతో పాటు కోచ్ లను నియమించాలని సూచించారు.నిజామాబాద్ జిల్లాలో స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణం విషయం అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని త్వరలో స్టేడియం నిర్మాణం జరిగేల కృషి చేస్తానని తెలియజేసారు.గిరిరాజా కళాశాల పూర్వవిద్యార్థిగా, అర్బన్ ఎమ్మెల్యేగా కళాశాల అభివృద్ధికి తగిన నిధులు ప్రభుత్వం నుండి వచ్చేల కృషి చేస్తానని అన్నారు. అభివృద్ధి విషయంలో అవసరమైతే పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్, కాంగ్రెస్ నాయకులతో కలిసి పని చేస్తాం అన్నారు.అనంతరం వివిధ క్రీడా రంగాలలో విజేతలుగా నిలిచినా క్రీడాకారులకు మెడల్స్, బహుమతులను ఎమ్మెల్యే క్రీడాకారులకు అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. పీ రామ్మోహన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ రంగా రత్నం, పిడి డాక్టర్ బాలమణి,తదితరులు పాల్గొన్నారు.

## రైతు మహోత్సవం ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



- లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశం

**నిజామాబాద్,ఏప్రిల్ 19(మనంప్రతినిధి):** రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించనున్న రైతు మహోత్సవం ఏర్పాట్లను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా చేపడుతున్న ఈ రైతు మహోత్సవాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారని కలెక్టర్ తెలిపారు. మూడు రోజుల పాటు కొనసాగే ఈ మహోత్సవంలో వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు హాజరై వారు పండించిన ఉత్పత్తులను ప్రదర్శిస్తారని, సహజసిద్ధమైన పద్ధతులలో పంటల సాగు, ఆధునిక యాంత్రీకరణ వినియోగం, అధునాతన వంగడాలు, పసుపు ఆధారిత ఉత్పత్తులు, పరిశ్రమల స్థాపనకు గల అవకాశాలు తదితర అంశాలకు సంబంధించి సుమారు 150 వరకు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. సాగు రంగానికి ఉపకరించే నూతన ఆవిష్కరణలతో కూడిన అధునాతన పరికరాలు, మేలురకం విత్తనాలను ప్రదర్శిస్తారని అన్నారు. వ్యవసాయం, అనుబంధ విభాగాలు, విశ్వవిద్యాలయాలు, బ్యాంకులు, స్టార్టప్ కంపెనీలు, ఎఫ్పీఓలు, ఇతర ప్రైవేట్ కంపెనీలకు సంబంధించిన స్టాల్స్ ఉంటాయని వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు రైతులకు సాగు రంగంలో అవలంభించాల్సిన ఆధునిక విధానాలు, అధిక దిగుబడుల సాధనకు పాటించాల్సిన పద్ధతులు, పెట్టుబడులను ఎలా తగ్గించుకోవడం, అధిక లాభాలను అందించే పంటలను ఎలా ఎంపిక చేసుకోవాలి తదితర అంశాల గురించి అవగాహన కల్పిస్తారని అన్నారు. ప్రగతిశీల అవార్డు గ్రహీత రైతులు తమ అనుభవాలను తోటి రైతులతో పంచుకుంటారని తెలిపారు. ఇలా విశేష ప్రాధాన్యతతో కూడిన రైతు మహోత్సవ కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు జరిపించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్టాల్ల్స్, వేదిక, షామియానాలు, సిట్టింగ్ ఏర్పాట్లు, తాగునీటి వసతి, పార్కింగ్ తదితర ఏర్పాట్లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతు మహోత్సవానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట వ్యవసాయ కమిషనరేట్ నుండి హాజరైన ఏ.డీ.ఏ లు హుస్సేన్ బాబు, వినోద్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.



## పదోన్నతలు పొంది జిల్లా కలెక్టర్ ను కలిసిన మున్సిపల్ అధికారి

**భీంగల్, ఏప్రిల్ 19( మనం న్యూస్):** మున్సిపల్ కార్యాలయం లో శనివారం కమిషనర్ కి పదోన్నతి పొందిన దానికి మున్సిపల్ సిబ్బంది శాలువాతో సన్మానించారు. కమిషనర్ కి గ్రేట్ 3 నుండి గ్రేట్ 2 పదోన్నతి వచ్చినందున ఘనంగా సన్మానించడం జరిగింది. అనంతరం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ని కలిసి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్ ఆర్ ఐ బండి రాజేశ్వర్ వార్డ్ ఆఫీసర్. బిల్ కలెక్టర్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఎంప్లాయిస్ జేఏసీ నూతన కార్యవర్గం




**నిజామాబాద్ కలెక్టరేట్,ఏప్రిల్ 19( మనం న్యూస్):** జిల్లాలో నూతనంగా ఏర్పాటైన ఎంప్లాయిస్ జేఏసీ కార్యవర్గం జిల్లా చైర్మన్ నాశెట్టి సుమన్ కుమార్ తో పాటు కార్యవర్గ సభ్యులు జిల్లా కలెక్టర్, రాజీవ్ గాంధీ హనుమంతు అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ కు పుష్పగుచ్ఛని అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ నాశెట్టి సుమన్ కుమార్ మాట్లాడుతూ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఎంప్లాయిస్ జేఏసీ అనేది ఒక పెద్ద కుటుంబం లాంటిదని ఆయన అన్నారు.

ప్రభుత్వపరంగా ఎంప్లాయిస్ ఉద్యోగస్తులకు రావలసిన అన్ని బెనిఫిట్స్ లను సకాలంలో అందే విధంగా తన వంతు కృషి చేస్తానని ఆయన ప్రభుత్వ ఉద్యోగస్తులకు భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగస్తులకు ప్రజల వద్దకు పాలన వంటి సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేరేందుకు ప్రభుత్వ ఉద్యోగస్తులం సహాయ శక్తుల వరకు పనిచేస్తామని ఆయన సూచించారు. అనంతరం శనివారం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ని, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ని ఐ డి ఓ సి కార్యాలయం లో మర్యాదపూర్వకంగా కలిసి, బొకే అందజేసి, ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా కార్యవర్గం నూతనంగా ఏర్పడిందని తెలియజేసి, ఉత్తర్వులను అందజేసిన ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ నాశెట్టి సుమన్ కుమార్ , జిల్లా కన్వీనర్ అలుక కిషన్ , కో కన్వీనర్ మోహన్ రెడ్డి అనంతరం గౌరవ జిల్లా కలెక్టర్ నూతనంగా ఎన్నికైన టీ జి ఈ జేఏసీ కార్యవర్గాన్ని అభినందించి, సభ్యులందరికీ శుభాభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో కో చైర్మన్లు యు టి ఎఫ్ రమేష్ టి జి ఆర్ ఈ ఎస్ ఏ ఎల్,. రమణ రెడ్డి , ఎస్ టి యు ధర్మవీర్ , క్లాస్ ఫోర్ నేరెళ్ల శ్రీనివాస్ టిఆర్టిఎఫ్ , బి.కృష్ణారెడ్డి పెన్షనర్ అసోసియేషన్ ఎమ్. రవీందర్ ,వైస్ చైర్మన్, రామ్మోహన్ రావు టి జి ఈ జేఏసీ భాగస్వామ్య సంఘాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు.

## వారు చట్టాలు చేస్తే.. పార్లమెంటును మూసేయాలి: బీజేపీ ఎంపీ కీలక వ్యాఖ్యలు

**ఢిల్లీ, ఏప్రిల్ 19 :** సుప్రీం కోర్టు ఉత్తర్వులపై బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. వక్ఫ్ సవరణ చట్టం, బిల్లులపై రాష్ట్రపతికి గడువు విషయంలో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై బీజేపీ నేతల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రపతికి గడువు నిర్దేశించేలా న్యాయవ్యవస్థ వ్యవహరించడం తగదని ఇప్పటికే ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ఖడ్ పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ పరిణామాలపై తాజాగా భాజపా ఎంపీ నిషికాంత్ దూబే చేసిన వ్యాఖ్యలు మరింత చర్చనీయాంశంగా మారాయి. ''ఒకవేళ సుప్రీంకోర్టు చట్టాలు చేస్తే గనుక.. పార్లమెంట్ భవనాన్ని మూసివేయాలి'' అని దూబే తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్గా మారింది.



రాష్ట్రాల శాసనసభలు ఆమోదించిన బిల్లులకు సమ్మతి తెలపడానికి రాష్ట్రపతికి, గవర్నర్లకు మూడు నెలల గడువు విధిస్తూ ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ పంపిన బిల్లులను రాష్ట్రపతి ఎటూ తేల్చకపోతే అప్పుడు రాష్ట్రాలు నేరుగా తమను ఆశ్రయించవచ్చని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అయితే, ఈ పరిణామాలపై ఉపరాష్ట్రపతి అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ఫలానా సమయంలోగా నిర్ణయాలు తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు ఆదేశించజాలదని అన్నారు. ప్రజాస్వామ్య శక్తులపై అణు క్షిపణిని సుప్రీంకోర్టు ప్రయోగించరాదని పేర్కొన్నారు. మరోవైపు న్యాయస్థానం ఉత్తర్వులను ప్రతిపక్షాలు స్వాగతిస్తున్నాయి.

## జాతీయం- అంతర్జాతీయం

## 110 మంది జేఈఈ అభ్యర్థుల ఫలితాలు నిలుపుదల: ఎన్టీఏ

**ఢిల్లీ, ఏప్రిల్ 19:** 110 మంది జేఈఈ అభ్యర్థుల ఫలితాలను ఎన్టీఏ నిలుపుదల చేసింది. జేఈఈ (మెయిన్) సెషన్-2 ఫలితాల్లో భాగంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పర్సంటైల్ స్కోరును వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో 110 మంది జేఈఈ అభ్యర్థుల ఫలితాలు నిలిపివేసింది. వారు అక్రమాలకు పాల్పడ్డారని, ఫోర్జరీ పత్రాలు ఉపయోగించినట్లు గుర్తించామని ఎన్టీఏ అధికారులు తెలిపారు.

కాగా.. జనరల్ విభాగంలో 93.102, ఈడబ్ల్యూఎస్-80.383, ఓబీసీ-79.431, ఎస్సీ-61.15, ఎస్టీ-47.90 పర్సంటైల్ స్కోర్ను కటాఫ్గా నిర్ణయించారు. ఈ స్కోర్కు సమానం, అంతకంటే ఎక్కువ స్కోర్ పొందినవారు మాత్రమే మే 18వ తేదీన జరగనున్న జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్ష రాసేందుకు అర్హత సాధిస్తారు. రెండు విడతల్లో కలిపి మొత్తం 24 మంది 100 పర్సంటైల్ స్కోర్ సాధించారు. అడ్వాన్స్డ్ పరీక్షకు ఏప్రిల్ 23 నుంచి మే 2 వరకు ఆన్లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నారు.

ఇదిలాఉంటే.. తొలుత గురువారమే జేఈఈ (మెయిన్) రెండో సెషన్ పేపర్ -1కు సంబంధించిన తుది కీని జాతీయ పరీక్షల మండలివిడుదల చేసినప్పటికీ.. కొన్ని గంటల్లోనే తొలగించింది. ఇందుకు కారణమేంటో తెలపకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర గందరగోళానికి గురైన విషయం తెలిసిందే. దీంతో శుక్రవారం ఉదయం స్పందించిన ఎన్టీఏ.. శనివారం లోగా ఫలితాలు విడుదల చేయనున్నట్లు 'ఎక్స్' వేదికగా ప్రకటించింది. అలాగే, ఈ మధ్యాహ్నం 2 గంటల కల్లా తుది కీ విడుదల చేస్తామని ప్రకటించడంతో విద్యార్థులు ఎదురు చూశారు. అయితే, తుది కీని సైతం చెప్పిన సమయం కన్నా గంటకు పైగా ఆలస్యంగా విడుదల చేయడంతో ఎన్టీఏ అధికారుల తీరుపై పలువురు నెటిజన్లు అసహనం వ్యక్తంచేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన సంగతి తెలిసిందే.

## బంగ్లాలో హిందూనేత హత్య.. తీవ్రంగా స్పందించిన భారత్

**ఢాకా, ఏప్రిల్ 19:** బంగ్లాదేశ్లో హిందూ మైనారిటీ నేత మృతి ఘటనపై భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్ధీర్ జైస్వాల్ స్పందించారు.


బంగ్లాదేశ్లో మైనారిటీలపై జరుగుతోన్న దాడులపై తాజాగా భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. మైనారిటీల రక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. బంగ్లాలో దినాజ్పూర్లో భబేశ్ చంద్ర మృతి ఘటన వేళ విదేశాంగశాఖ స్పందన వచ్చింది.''బంగ్లాదేశ్లో హిందూ మైనార్టీ నేత భబేశ్ చంద్ర రాయ్ కిడ్నాప్, దారుణ హత్య గురించి మా దృష్టికి వచ్చింది. ఆ ఘటన ఎంతగానో కలచివేసింది. బంగ్లాలో తాత్కాలిక ప్రభుత్వపాలనలో హిందూ మైనారిటీలపై జరుగుతోన్న దాడుల్లో ఇది ఇంకో ఘటన. గతంలో ఈ తరహా దాడులకు పాల్పడినవారు ఎలాంటి శిక్ష లేకుండా స్వేచ్ఛగా తిరుగుతున్నారు. ఈ ఘటనను మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. ఎలాంటి సాకులు, వివక్ష లేకుండా మైనారిటీలను రక్షించే బాధ్యత ఈ తాత్కాలిక ప్రభుత్వం నిర్వహించాలని మరోసారి గుర్తుచేస్తున్నాం'' అని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తన ప్రకటనలో స్పష్టం చేశారు.ఉత్తర బంగ్లాదేశ్ లోని దినాజ్పూర్కు చెందిన భబేశ్ చంద్రరాయ్ (58)కు గురువారం సాయంత్రం ఓ ఫోన్ కాల్ వచ్చింది. తాను ఇంట్లోనే ఉన్నానని భబేశ్ అవతలి వ్యక్తికి చెప్పారు. అరగంట తర్వాత నలుగురు వ్యక్తులు ఆయన ఇంటికి వచ్చి బలవంతంగా తీసుకెళ్లినట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు గాలింపుచర్యలు చేపట్టిన పోలీసులకు నరబరి గ్రామంలో భబేశ్ తీవ్రగాయాలపాలై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ కన్పించారు. వెంటనే ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే ఆయన మృతి చెందారు. దుండగులు అతడిని తీవ్రంగా కొట్టినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. మాజీ ప్రధాని షేక్హసీనా దేశం విడిచివెళ్లిన తర్వాత బంగ్లాదేశ్ లో మైనారిటీలు, హిందువులపై క్రమంగా దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. దీనిపై భారత్ కూడా స్పందించింది. పొరుగుదేశంలో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని పేర్కొంది.

## జమ్మూకశ్మీర్లో ప్రొఫెస్ప సైనికుల దాడి.. విచారణ చేపట్టిన ఆర్మీ

**కశ్మీర్, ఏప్రిల్ 19:** జమ్మూకశ్మీర్లో తనపై పలువురు ఆర్మీ సిబ్బంది దాడి చేశారంటూ ఒక ప్రొఫెసర్ చేసిన ఆరోపణలపై అధికారులు విచారణ చేపట్టారు.

జమ్మూకశ్మీర్లో వాహనాల తనిఖీ సమయంలో కొందరు సైనికులు తనపై దాడి చేశారని యూనివర్సిటీ ప్రొఫెసర్ ఒకరు ఆరోపించారు. దీనిపై భారత సైన్యాధికారులు విచారణ చేపట్టారు. రాజౌరీ జిల్లాలో గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది.

ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీలో లియాఖత్ అలీ ప్రొఫెసర్గా పనిచేస్తున్నారు. ఆయన మరికొందరితో కలిసి ఒక వివాహ వేడుకకు హజరై కలకోట్కు తిరిగి వస్తున్నారు. ఆ సమయంలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఆర్మీ సిబ్బంది తనపై దాడి చేశారని అలీ ఆరోపించారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా ఒక పోస్టు చేశారు. 'నా కుటుంబంలోను ఎంతోమంది సైన్యంలో ఉన్నారు. అందుకు నేను ఎంతో గర్వపడతాను. కానీ, ఈ రోజు జరిగిన ఘటన ఆ గౌరవాన్ని తగ్గించింది. వారు నా గుర్తింపుకార్డును చూపించమన్నారు. అది చూపించేందుకు కారు దిగుతున్న నాపై అనూహ్యంగా దాడి చేశారు. వారి ఆయుధాలతో నా తలపై కొట్టి గాయపరిచారు. దీనికి వాళ్లు నాకు క్షమాపణ కూడా చెప్పలేదు. సైన్యం మన



దేశానికి గర్వకారణం. నాకు న్యాయం జరగాలి' అని ప్రొఫెసర్ పేర్కొన్నారు. తన తలకు ఆరుకుట్లు పడినట్లు ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెల్లడించారు.

ఇక, దీనిపై ఆర్మీ అధికారులు స్పందించారు. ఉగ్రవాద కదలికలపై సమాచారం అందడంతో సైనిక సిబ్బంది వాహనాల తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఆ సమయంలోనే ఈ ఘటన చోటుచేసుకుందని వెల్లడించారు. దీనికి సంబంధించి కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు పేర్కొన్నారు. అయితే, తనిఖీ సమయంలో ఆ వ్యక్తి విధుల్లో ఉన్న సిబ్బంది నుంచి ఆయుధాలు లాక్కునేందుకు ప్రయత్నించినట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందన్నారు. ఈ నేపథ్యంలో ఆయన సిబ్బందితో గొడవ పడినట్లు వెల్లడించారు. దీనిపై పూర్తి విచారణ జరిపి, సిబ్బంది ఎవరైనా దురుసుగా ప్రవర్తించినట్లు తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఈ ఘటనను పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షురాలు, మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ ఖండించారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్మీని కోరారు. జమ్మూకశ్మీర్ భాజపా మాజీ అధ్యక్షుడు రవీందర్ రైనా కూడా దీనిపై స్పందించారు. మన దేశంలో చట్టానికి ఎవరూ అతీతులు కాదన్నారు. దాడి ఎవరు చేసినా వారు తగిన పర్యవసానాలు ఎదుర్కోక తప్పదని ప్రొఫెసర్కు హామీ ఇచ్చారు.

# అధునాతనమైన వసతులతో కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ అందుబాటులోకి తెచ్చాం

- రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా పటిష్టపరుస్తున్నాం
- రాష్ట్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

**కర్నూలు, ఏప్రిల్19మనం న్యూస్:** అధునాతనమైన వసతులతో కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ అందుబాటులోకి తెచ్చాం అని రాష్ట్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య,శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ లో ఏర్పాటు చేసిన లీనియర్ ఆక్సిలరేటర్, సి.టి.సిములేటర్ యంత్రాలు, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, మెడికల్ అంకాలజీ వార్డు లను రాష్ట్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ కలిసి ప్రారంభించారు..ఈ సందర్భంగా కాన్సర్ ఇన్స్టిట్యూట్ లోని అన్ని వార్డులను పరిశీలించి, దాదాపు రెండు గంటల సమయం పైగా రోగులతో ముచ్చటిస్తూ గడిపారు.. కేన్సర్ నివారణ విభాగము , అత్యవసర విభాగం, మెడికల్ ఆంకాలజీ వార్డ్ లను పరిశీలిస్తూ అక్కడే ఉన్న రోగులు తిప్పమ్మ, రాజేశ్వరి, సుప్రియ, చిన్నప్ప, రాజు లతో మాట్లాడుతూ వైద్యం ఏ విధంగా అందుతోంది, డాక్టర్లు బాగానే చూసుకుంటున్నారా, మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని రోగులను అడిగి తెలుసుకున్నారు.. అనంతరం సూపర్ స్పెషాలిటీ లోని కార్డియో థోరాసిక్ వ్యాస్కులర్ సర్జరీ వార్డు ను పరిశీలిస్తూ బై పాస్ సర్జరీ చేయించుకున్న వారితో మాట్లాడుతూ వారి ఫీడ్ బ్యాక్ ను మంత్రి తీసుకున్నారు..రోగులు స్పందిస్తూ, డాక్టర్లు వైద్య సేవలు చాలా బాగా అందిస్తున్నారని, సమస్యలు లేవని చెప్పడంతో మంత్రి సంతోషించారు.. అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏ ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో లేని విధంగా కేన్సర్ ఇన్స్టిట్యూట్ లో 28 కోట్ల రూపాయల విలువ గల అత్యాధునిక లీనియర్ ఆక్సిలరేటర్ ను, దాదాపుగా 2 కోట్ల 50 లక్షల రూపాయలు విలువ చేసే అనేక రోగ నిర్ధారణ పరికరాలను కూడా ప్రారంభించామన్నారు..తద్వారా రాష్ట్రంలో అధునాతమైన క్యాన్సర్ చికిత్స కర్నూలు లో అందబోతుందన్నారు.... ఇప్పటికే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల వైద్య రంగంలో విశిష్టమైన సేవలు అందిస్తోందన్నారు... సర్జికల్ ఆంకాలజీ, జనరల్ ఆంకాలజీ లలో ఊహకు అందని సర్జరీలను వైద్యులు చేశారన్నారు.. 14 సంవత్సరాల అమ్మాయికి అత్యాధునిక బ్రెయిన్ సర్జరీ చేశారన్నారు.. ఈ విధంగా అత్యాధునిక పద్ధతిలో వైద్యులు అనేక సర్జరీలు



చేశారన్నారు..వార్డులను పరిశీలించి రోగులను పరామర్శిస్తున్న సమయంలో వారు వైద్యులు అందిస్తున్న సేవలుపట్ల చాలా సంతృప్తి వ్యక్తం చేశారని మంత్రి పేర్కొన్నారు. వైద్యులు రోగులకు అందిస్తున్న సేవలు చాలా బాగున్నాయని మంత్రి వైద్యులను వైద్య సిబ్బందిని అభినందించారు.. ఇదే విధంగా రోగులకు అందించే వైద్య సేవలను కొనసాగించాలని మంత్రి సూచించారు.. రాష్ట్రంలోనే గర్వించదగ్గ వైద్య సంస్థగా, వైద్య కళాశాలగా కర్నూలు ఆస్పత్రిని తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు..

సంవత్సరం కిందట సమీక్ష నిర్వహించినప్పుడు వైద్య రంగంలో అనేక కొరతలు కనిపించాయన్నారు.. ప్రధానంగా డాక్టర్ల కొరత ఉండేదని, 40 శాతం డాక్టర్ల కొరత ఉంటే ఇటీవలే రీడిప్లాయిమెంట్ చేయడం జరిగిందన్నారు.. అందులో భాగంగా ఆదోని, ఇతరత్రా ప్రాంతాల నుండి డాక్టర్లను, బోధన సిబ్బందిని కర్నూలుకి తీసుకొని వస్తే కేవలం 6 నుండి 7 శాతం మాత్రమే టీచింగ్ స్టాఫ్ కొరత ఉందన్నారు.. అసిస్టెంట్ ప్రొఫెసర్ లు, కింది స్థాయిలో ఇంకా కొరత ఉందని వాటిని రిక్రూట్మెంట్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.. గత ప్రభుత్వం రిక్రూట్మెంట్ జీరో వేకెన్సీ పాలసీ అని చెప్పారు కానీ సిబ్బంది నియామకంలో చాలా కొరత ఉందన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా పటిష్టపరిచే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నారన్నారు.

2018 సంవత్సరంలో కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఉన్న సమయంలో కేంద్రం నుండి 60 శాతంతో రాష్ట్రం నుండి 40 శాతంతో 120 కోట్ల రూపాయలతో స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ మంజూరు అయిందన్నారు... ఐతే కేంద్రం నుండి నిధులు విడుదల అయినప్పటికీ పనులు మొదలు పెట్టకుండా గత ప్రభుత్వం ఐదు సంవత్సరాలు కాలయాపన చేశారన్నారు.. రాయలసీమలో చాలామంది పేద ప్రజలు ఉన్నారని, క్యాన్సర్ కేసులు ఏటా పెరుగుతూ పోతున్నాయన్నారు.. 2022 సంవత్సరంలో 73 వేల కొత్త క్యాన్సర్ కేసులు వస్తే అందులో 41 వేల మంది ప్రాణాలు కోల్పోయారన్నారు..అయినా కూడా గత ప్రభుత్వం కేన్సర్ ఇన్స్టిట్యూట్ పై శ్రద్ధ పెట్టలేదన్నారు.అధునాతమైన వైద్య సేవలు అందించడానికి డాక్టర్లు సిద్ధంగా ఉన్నారని, వారికి ఇన్ఫ్రా స్ట్రక్చర్, ఎక్విప్మెంట్, సర్జికల్ ఫెసిలిటీ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు..కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ పై ప్రత్యేక శ్రద్ధ వహించి సమీక్షలు నిర్వహించుకుని 3 నెలల పాటు ఏమి కొరతలు ఉన్నాయని విషయాలను గుర్తించేందుకుగాను ఒక ఏడిఎమ్ఈ ని నియమించడం జరిగిందన్నారు.. 45 కోట్ల రూపాయలు విలువైన అధునాతమైన పరికరాలకు 3 నెలల్లో సమకూర్చామన్నారు.. అదే విధంగా మౌలిక సదుపాయాలను కూడా కల్పించామన్నారు.. కొంతమంది ప్రత్యేక బోధన సిబ్బంది రావాల్సి ఉందని, వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు.. మార్చి 30 వ తేది నాటికి క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ మౌలిక సదుపాయాలు పూర్తి చేసుకుని, టెక్నీషియన్లు డాక్టర్లు స్పెషలిస్టులు సూపర్ స్పెషలిస్టులు కూడా అందుబాటులోకి రావాలని లక్ష్యాన్ని పెట్టడం జరిగిందని, కానీ మార్చి 4 వ తేదీకే నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తిచేసి ట్రైల్ బేస్ మీద అనేక రకాలైన సర్జరీలు చేసి ఉచితంగా వైద్య సేవలు అందించారన్నారు.. ఈ విధంగా సేవాభావం అంకితభావం ఉన్న డాక్టర్లు ఉన్నప్పుడు వారిని మోటివేట్ చేసి వారికి కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ విషయాలను గత ప్రభుత్వం మరిచినప్పటికీ మన కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైద్య రంగంపై రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు సమీక్షలు నిర్వహించి వైద్యులకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు.. కేంద్ర ప్రభుత్వం నుండి వైద్య రంగానికి సంబంధించి సహాయ సహకారాలు అందుతున్నాయన్నారు.. ప్రత్యేకించి వైద్య రంగానికి 15 వ కమిషన్ కింద నిధులు వస్తున్నాయన్నారు.. ఆయుష్మాన్ భారత్ హెల్త్ మిషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కింద కూడా పెద్ద ఎత్తున నిధులు లభిస్తున్నాయన్నారు. కింది స్థాయి పీహెచ్సీ నుండి కూడా వైద్య సేవలు పటిష్టంగా అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.. క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ లో కేవలం ఆంధ్రప్రదేశ్ కి సంబంధించిన రోగులే కాకుండా కర్ణాటక, తెలంగాణ నుండి వచ్చి ట్రీట్మెంట్ తీసుకుంటున్నారని మంత్రి పేర్కొన్నారు.ప్రైవేట్ ఆస్పత్రులలో 20 నుండి 25 లక్షల వరకు అందించే వైద్యాన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా అందిస్తున్నారని విషయాన్ని అదేవిధంగా రోగులను వైద్యులు కుటుంబ సభ్యులుగా చూసుకుంటున్నారని విషయాన్ని ప్రజలలోకి తీసుకొని వెళ్లాల్సిన బాధ్యత మీడియాపై ఉందని మంత్రి సూచించారు.

## ఎన్టిఏ జేఈఈ మెయిన్స్ ఫలితాలలో నారాయణ విద్యార్థుల ప్రభంజనం

**కర్నూలు ఏప్రిల్ 19(మనం న్యూస్) :** ఎన్ టి ఏ జేఈఈ మెయిన్స్ ఫేస్ 2లో ఫలితాలలో మరోసారి కర్నూలు నారాయణ విద్యార్థిని విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని నారాయణ విద్యా సంస్థల యాజమాన్యం ప్రశంసించింది. కర్నూలు నారాయణ కళాశాల నుండి టి.మిథున్ సాయి 99.91 పర్సంటైల్స్తో 1464 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు మరియు క్యాటగిరి నందు 253వ ర్యాంకు, కె. జీవన్ కుమార్ 99.85 పర్సంటైల్తో 2430 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు మరియు క్యాటగిరి నందు 447వ ర్యాంకు, కె.చరణ్ కుమార్ 99.84 పర్సంటైల్తో 2605 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు మరియు క్యాటగిరి నందు 488వ ర్యాంకు, ఎస్. శివ ధనుష్ 99.48 పర్సంటైల్తో 8180 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు, ఖాజా ఫౌజాన్ అహ్మద్ 99.43 పర్సంటైల్స్తో 8930 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు మరియు క్యాటగిరి నందు 1091వ ర్యాంకు, కె.సాయి శృతి99.43 పర్సంటైల్తో 8933 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు, ఎస్.సాయి మానస్ గౌడ్ 99.29 పర్సంటైల్తో 11030 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు మరియు క్యాటగిరి నందు 2504వ ర్యాంకు, కె. సాయి భాస్కర్ 99.21 పర్సంటైల్తో 12263 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు, ఎన్ హర్షిత 99.19 పర్సంటైల్తో 12470 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు, ఎమ్. శాంతా జోన్స్ 99.10 పర్సంటైల్తో 13970 ఆల్ ఇండియా ఓపెన్



ర్యాంకు మరియు క్యాటగిరి నందు 3284వ ర్యాంకు, డి. ధరణి 99.09 పర్సంటైల్తో 14139 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు మరియు క్యాటగిరి నందు 1845వ ర్యాంకు, ఎ. ఫణిశ్రీ సౌగంధ్ 98.81 పర్సంటైల్తో 18433 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు, టి. రాహుల్ అపురూప్ 98.57 పర్సంటైల్తో 22050 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు, కె. తన్మయి రెడ్డి 98.49 పర్సంటైల్తో 23168 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు, జె. ప్రణీత్ రెడ్డి 98.38 పర్సంటైల్ 24916 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకులు వచ్చాయి. అలాగే ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకులో 5,000 లోపు ముగ్గురు,. 10,000 లోపు 6 మంది,.20,000 లోపు 12మంది, 30,000 లోపు 16మంది, 40,000 లోపు 23మంది, 50,000 లోపు 26మంది, 60,000 లోపు 29మంది, 80,000 లోపు 33మంది, 100000 లోపు 38మంది విద్యార్థులకు ర్యాంకులు వచ్చాయి. అంతే కాక దీనితోపాటు వివిధ క్యాటగిరి నందు టి. మిథున్ సాయి 253 ర్యాంకు, ఎమ్. రుషి తేజ 334 ర్యాంకు, కె. జీవన్ కుమార్ 447 ర్యాంకు, కె. చరణ్ కుమార్ 488 ర్యాంకు, ఎమ్.చంద్ర శేఖర్ కుమార్ యాదవ్ 784, ఆల్ఫ్రెడ్ మణిదీప్ 877 ర్యాంకులు వచ్చాయి.ఈ కార్యక్రమంలో కళాశాల డి.జి.ఎమ్. టి. గోవర్ధన్ రెడ్డి, డీన్లు ఆంజనేయ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, డి. వేణు గోపాల్ రెడ్డి ప్రిన్సిపాల్స్ బి. విజయ మోహన్, పి.సుజాత, ఎన్.సారిక , ఎ. సరిత అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ ఐక్యమత్యంగా జీవించాలి...సీఐ శ్రీనివాసరెడ్డి

**మహానంది, ఏప్రిల్19, (మనంన్యూస్) :** గ్రామాలలో ప్రజలందరూ శాంతియుతంగా కలసి మెలసి ఉండాలని నంద్యాల తాలుకా సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి కోరారు. శనివారం మహానంది మండల పరిధిలోని గోపవరం గ్రామంలో ఎస్ ఐ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కార్డెన్ సర్చ్ ను సిబ్బంది ద్వారా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు అనుమానితుల ఇళ్లల్లో, షాపులలో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి నిమిషం సెల్ ఫోన్ లేనిది ఏ పని చేయలేకపోతున్నారని తెలిపారు.

బ్యాంక్ ఖాతా, పాన్ కార్డ్, ఆధార్ కార్డు, పెన్షనుకు సెల్ నంబర్ అవసరంగా మారిందన్నారు. దాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ప్రజలకు ఏదో ఒక ఆశ చూపి సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ప్రజలందరూ పూర్తి అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఎటిఎం పిన్ నంబర్, సివివి



నంబరు, బ్యాంకు ఖాతా వివరాలు అడితే చెప్పరాదని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే 1930 కి కాల్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన కలిగించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని,వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ఉంటే తలకు ఒక రక్షణ కవచంలా ఉపయోగపడుతుందని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు వలన మరణించే వారిలో ఎక్కువగా తలకు గాయాలై మరణించడం జరుగుతుందని, దానిని నివారించాలంటే తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. గ్రామాల్లో ప్రజలందరూ ఐక్యమత్యంతో, ప్రశాంత వాతావరణంలో జీవించాలనీ, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసుల దృష్టికి తెచ్చి, సమస్య పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బండి ఆత్మకూరు ఎస్సై జగన్మోహన్, గోస్పాడు ఎస్సై వెంకటప్రసాద్, మహానంది పోలీస్ సిబ్బంది శేషు, రజాక్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

## మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

**జూపాడు బంగ్లా ఏప్రిల్ 19 (మనం న్యూస్)** జూపాడుబంగ్లా మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయము నందు స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని స్పెషల్ ఆఫీసర్ నాగరాజరావు, ఆధ్వర్యంలో ఎంపీడీవో గోపికృష్ణ, తాసిల్దార్ చంద్రశేఖర్ నాయక్, అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, లో భాగంగా పరిసరాలు, పరిశుభ్రత, మనకు ఎంతో ప్రాముఖ్యమని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆఫీసుల్లో ఉండే ప్లాస్టిక్ వస్తువులు, ప్లాస్టిక్ పేపర్లు, కూలర్లు, కంప్యూటర్, ప్యాడ్లు, ఈ వేస్ట్ అండ్ ఎనీ వేస్ట్; పనిచేయకుండా పాడైపోయి నటువంటి ప్లాస్టిక్ వ్యర్థాలను ఒక రెడ్యూస్, ఈ సైకిల్ అండ్ అనే కార్యక్రమం పెట్టి వాటి ద్వారా ఈ మెటీరియల్ పంపిస్తే వాటిని పగలగొట్టి వాటిలో ఉండే సిల్వర్ కాపర్ వాటిని కాల్చి కొత్త ఉపయోగ పరికరాలుగా మరల ఉపయోగించేందుకు తోడ్పాటు జరుగుతుందని వారు తెలియజేశారు, అనంతరం ఆఫీసులో ముందు ఎలాంటి చెత్తాచెదారం లేకుండా ఆఫీస్ పరిసరాలు చుట్టూ శుభ్రపరచుకొని ఎనీ వేస్ట్ ఉండనీయకుండా పరిశుభ్రంగా ఉండే విధంగా ప్రతి ఒక్క ఇబ్బంది కృషి చేయాలని, వారు తెలియజేశారు,



తంగడంచ గ్రామంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఏపిఎం అంబమ్మ నిర్వహించారు

ఈ సందర్భంగా ఆమె తంగడంచ గ్రామంలో పంచాయతీ సెక్రెటరీ కుమార్ అధ్యక్షతన ఏపీఎం అంబమ్మ ఆధ్వర్యంలో వీధుల వెంట ర్యాలీగా తిరుగుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, గురించి వివరించడం జరిగినది. ఇంటి పరిసరాలు చుట్టూ వేస్ట్ పదార్థాలు చెత్తాచెదారం నిల్వ ఉంచరాదని. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తడి పొడి చెత్తను వేరు చేసి చెత్తకుండీలో వేయాలని ఆమె సూచించారు. అదేవిధంగా ప్లాస్టిక్ వస్తువులను ప్లాస్టిక్ పేపర్ల,ను పాత కూలర్ల,ను, పాడైపోయిన వాటిని ఇంట్లో నిల్వ ఉంచరాదని వాటిని సరిచేసి పార వేయకుండా వినియోగదారులకు ఇచ్చే విధంగా చూడాలని ఆమె తెలిపారు,

అనంతరం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞను పలికించడం జరిగినది,ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ నాగేంద్ర, హౌసింగ్ ఏఈ, ఏ ఎస్ ఓ హనుమంతు, డిప్యూటీ తాసిల్దార్ నాగన్న, పంచాయతీ సెక్రెటరీ కుమార్, ఏ పీ వో ఎస్ రేష్మ, తాటిపాడు సర్పంచ్, ఏ ఎన్ ఎం, లు వి వో ఏ లు పొదుపు లక్ష్మి మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## వీరశైవ లింగాయతులు

### రాజకీయంగా అభివృద్ధి చెందాలి

- వీరశైవ లింగయత జాతీయ అధ్యక్షుడు
- ప్రవీణ్ కంకణ వడి

**మంత్రాలయం ,ఏప్రిల్ 19, (మనం న్యూస్) ;** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వీరశైవ లింగాయితులు రాజకీయంగా అభివృద్ధి చెందాలని వీరశైవ లింగాయిత సంఘటిత వేదిక జాతీయ అధ్యక్షుడు ప్రదీప్ కంకణ వాడి పేర్కొన్నారు .శనివారం మంత్రాలయం చేరుకున్న ఆయనకు మంత్రాలయం మండల అధ్యక్షులు మూలింటి చంద్రశేఖర్ గౌడ్ స్వాగతం పలికారు.అనంతరం రాఘవేంద్ర స్వామి మఠానికి చేరుకున్న వారు గ్రామ దేవత మంచాలమ్మను , రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు .ఈ సందర్భంగా ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో వీర శైవులు రాజకీయంగా ఎంతో ఎత్తుకు ఎదిగి, ఉన్నత పదవులు అనుభవిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ లో వీరశైవ లింగాయితులు రాజకీయంగా అభివృద్ధి చెందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్ర రాష్ట్రంలో వీరశైవ లింగాయితుల బలోపేతానికి కృషిచేసి , మండల, నియోజకవర్గ , జిల్లా రాష్ట్రస్థాయిలో సంఘటిత వేదికను తయారు చేసి వీరశైవ లింగాయితులను రాజకీయంగా ఎదుగుదలకు కృషి చేస్తామన్నారు.



ఈ కార్యక్రమంలో మంత్రాలయం మండల వీరశైవ లింగాయత సంఘటిత వేదిక గౌరవ అధ్యక్షుడు ఆడిటర్ శంకర్ స్వామి, ఉపాధ్యక్షుడు రుద్రయ్య స్వామి , ఎల్లా లింగస్వామి , పరమేష్ గౌడు , పాండు గౌడు, రమేష్ చట్నీహళ్లి రవి గౌడు మల్లి గౌడు తదితరులు ఆయనకు చాలా పూలమాలతో ఘనంగా సత్కరించారు .

## మహానందిలో జడ్జి పూజలు

**మహానంది, ఏప్రిల్19,(మనం న్యూస్):** మహానంది పుణ్యక్షేత్రం లో ఆళ్లగడ్డ జె ఎం ఎఫ్ సి జడ్జి ఈశ్వర్ వెంకట ప్రసాద్ పూజలు నిర్వహించారు. శనివారం శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివారి దర్శనార్థమై వచ్చిన ఆయన కు టెంపుల్ ఇన్స్పెక్టర్ మల్లయ్య స్వాగతం పలికారు. అనంతరం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆనవాయితీ ప్రకారం కళ్యాణ మండపంలో కండువా కప్పి స్వామివారి ప్రసాదాలు అందజేశారు.




## స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ప్రారంభం



**జూపాడు బంగ్లా ఏప్రిల్ 19 (మనం న్యూస్)** జూపాడుబంగ్లా మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం ఎదుట తాసిల్దార్ చంద్రశేఖర్ నాయక్ ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది, ఈ సందర్భంగా తాసిల్దార్ చంద్రశేఖర్ నాయక్, మాట్లాడుతూ పరిసరాలు, పరిశుభ్రత, ఆఫీసుల్లో అయితే నేమి మన పరిసరాల్లో అయితే నేమి శుభ్రంగా పెట్టుకోవడానికి నెలలో మూడోవ శనివారాన్ని కేటాయించినట్లు ఈరోజు మనం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, ప్రతి శనివారం మనం పరిసరాల పరిశుభ్రత గురించి మాట్లాడుకోవడం జరుగు తుందని. పోయిన మూడవ శనివారం మనం ప్లాస్టిక్ గ్లాసులు ఆయితేనేమి ప్లాస్టిక్ పేపర్లు అయితేనేమి. ప్లాస్టిక్ ని నిషేధించి క్లీన్ చేసుకోవడం జరిగినది. ఈరోజు ఈ వేస్ట్ అంటే మన నిత్య జీవితంలో మొబైల్ అయితేనేమి కంప్యూటర్, అయితే నేమి లాప్టాప్ అయితే నేమి అలాంటివి ఎక్కువై పోయినాయి అవి నిరంతరం పనిచేయవు. పాడైపోతుంటాయి కాబట్టి వాటన్నిటిని కూడా ఆఫీసుల్లో ఉండేటువంటి ఈ వేస్ట్ ను కూడా సేకరించి వాటిని ఒక కేంద్రంలో సిప్లార్ అనే కేంద్రంలో రెడ్యూస్, రీసైకిల్ అండ్ రీయూస్ అనే కార్యక్రమం పెట్టి వాటి ద్వారా ఈ మెటీరియల్ పంపిస్తే వాటిని పగలగొట్టి వాటిలో ఉండే వరద పదార్థాలతో మరల నూతనంగా ఏర్పడే వస్తువులు తీసుకోబడతాయని ఆయన తెలియజేశారు, అదేవిధంగా ఈ కార్యక్రమాన్ని స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయడం జరిగినది నేను నా పరిసరాలు పరిశుభ్రత కొరకు ప్రతిరోజు కొంత సమయం కేటాయిస్తానని, నా వంతు కృషిగా స్వచ్ఛత కార్యక్రమాల కొరకు శ్రమదానం చేసే పరిశుభ్రత ఆంధ్ర ప్రదేశ్ సాధించే సంకల్పానికి కట్టుబడి ఉంటానని, ఈరోజు పరిశుభ్రత గురించి నేను వేసిన ఈ ముందడుగు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని శుభ్రపరచడంలో సహాయం చేస్తుందని నమ్ముతూ, ఈరోజు నుండి నా తోటి వారికి కూడా స్వచ్ఛత కొరకు తడి ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి వాటిని శాస్త్రీయంగా తొలగించడం పై అవగాహన కల్పించడానికి ప్రయత్నిస్తానని మన ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ గా తీర్చిదిద్దేటట్లు నా వంతు కృషి చేస్తానని రెవెన్యూ సిబ్బందితో ప్రమాణం చేయించడం జరిగినది ఈ కార్యక్రమంలో గణన నియంత్రణ అధికారి, హనుమంత్,డిటి నాగన్న, సర్వే ఆఫీసర్ కుమార్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా

## ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం



**జూపాడుబంగ్లా, ఏప్రిల్ 19 (మనం న్యూస్):** నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, ఐ పీ ఎస్ ఆదేశాలమేరకు ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్ సూచనలతో తర్తూర్ గ్రామం నందు గల ఆటో డ్రైవర్లకు జూపాడుబంగ్లా సబ్ ఇన్స్పెక్టర్ ఎస్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ సందర్భంగా సబ్ ఇన్స్పెక్టర్ ఎస్ లక్ష్మీనారాయణ, మాట్లాడుతూ హైవే పనులు జరుగుతున్న సందర్భంగా ప్రయాణికులను చేరవేసేటప్పుడు రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. ప్రతి ఒక్కరూ వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ మరియు ఇన్సూరెన్స్ ధ్రువపత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండాలి.పరిమితికి మించి ఆటోలలో ప్రయాణికులను చేరవేయరాదు. అతివేగంగా అజాగ్రత్తగా ఆటోలు నడిపి రోడ్డు ప్రమాదాల బారిన పడవద్దు.ఆటోలను రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేయరాదు. ఆటోలు నడుపు సమయంలో డ్రైవర్ పక్కన ప్రయాణికులను కూర్చోబెట్టుకో రాదు. రాత్రి సమయాలలో ప్రయాణించేటప్పుడు ప్రమాద సూచికలను గమనిస్తూ సురక్షితంగా గమ్యం చేరాలని తెలియజేశారు.

## మండ్లెం గ్రామం నందు రీ సర్వే ప్రాజెక్టు ర్యాలీ నిర్వహించి ప్రారంభించడమైనది

**జూపాడు బంగ్లా ఏప్రిల్ 19 (మనం న్యూస్)** నంద్యాల జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్, వారి ఉత్తర్వుల మేరకు మండ్లెం గ్రామం నందు రీ సర్వే ప్రాజెక్టును రైతుల సమక్షంలో తహశీల్దారు చంద్రశేఖర్ నాయక్ ప్రారంభించి ,సర్వే టీంకు సూచనలు ఇవ్వడమైనది. రైతులు సర్వే టీమ్ వస్తున్నప్పుడు అందరు పొలం దగ్గరకు హాజరై రీ సర్వే సక్రమంగా జరుగు లాగునా సహకరించాలి అని. రైతులను కోరి యున్నారు.21-04-2025 న రీ సర్వే కొరకు మండ్లెం గ్రామములో గ్రామ సభ నిర్వహించబడును అందరు గ్రామ సభకు హాజరై రైతుల యొక్క సందేహాలు నివృత్తి చేసుకోవాలని తెలియజేశారు . మండ్లెం గ్రామం మొత్తం విస్తీర్ణము 6,527 ఏకరములు కలదు,




రోజుకు 20 ఏకరముల చొప్పున సర్వే చేయడం జరుగుతుంది అని ఆయన తెలియజేశారు.

ఈ రోజు జరిగిన రీ సర్వే ర్యాలీ లో,డిప్యూటీ తహశీల్దార్ (రీ సర్వే) జి.నాగన్న, డిప్యూటీ ఇన్ స్పెక్టర్ అఫ్ సర్వే ఉమాపతి, మండల సర్వేయర్ డి అతీఫ్, ఈశ్వరయ్య, గ్రామ రెవెన్యూ అధికారి, పెద్దబాబు, ఉమరాణి, గ్రామ సర్వేయరులు గ్రామం రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.




# కుర్రాళ్లు.. అదుర్స్

టీ20 క్రికెట్ అంటేనే కుర్రాళ్ల ఆట. ఈ ఫార్మాట్లో ప్రపంచ అత్యుత్తమ లీగ్ అయిన ఐపీఎల్ ఎందరో ప్రతిభావంతుల్ని వెలుగులోకి తెచ్చింది. ఈ సీజన్లో కూడా యువ ఆటగాళ్లు దూకుడు చూపిస్తున్నారు. ఇప్పటికే లీగ్ లో కొంత ప్రభావం చూపిన ఆటగాళ్లకు తోడు.. కొత్త కుర్రాళ్లు ఈ సీజన్లో అందరి దృష్టినీ తమ వైపు తిప్పుకొంటున్నారు. ప్రియాంశ్ ఆర్య.. ఈ సీజన్లో బ్యాటింగ్ సంచలనం అంటే ఇతనే. 23 ఏళ్ల ఈ దిల్లీ కుర్రాడు.. పంజాబ్ కింగ్స్ తరఫున ఓపెనర్ గా విధ్వంసక బ్యాటింగ్ తో అదరగొడుతున్నాడు. చెన్నై సూపర్ కింగ్స్ మీద అతను కేవలం 39 బంతుల్లోనే సెంచరీ బాదేశాడు. తన తొలి మ్యాచ్లోనే 23 బంతుల్లో 47 పరుగులు చేసి ఐపీఎల్ కెరీర్ ను ఘనంగా ఆరంభించిన ప్రియాంశ్.. తర్వాతి రెండు మ్యాచ్ ల్లో విఫలమైనప్పటికీ, చెన్నై మీద చెలరేగిపోయాడు. చివరి రెండు మ్యాచ్ ల్లోనూ దూకుడైన బ్యాటింగ్ తో ఆకట్టుకున్నాడు. సీజన్ ఆరంభానికి ముందు దిల్లీ ప్రిమియర్ లీగ్ లో ఆరు బంతుల్లో ఆరు సిక్సర్లతో ఐపీఎల్ ఫ్రాంఛైజీల దృష్టిలో పడ్డ ప్రియాంశ్.. వేలంలో ఏకంగా రూ.3.8 కోట్లు పలికాడు. ఆ రేటు ఎక్కువేమీ కాదని తన ప్రదర్శన చూస్తే అర్థమవుతోంది. ఈ సీజన్లో ఇప్పటిదాకా ప్రియాంశ్ 7 మ్యాచ్లాడి 232 పరుగులు చేశాడు. అతడి స్ట్రైక్ రేట్ 200 పైనే కావడం విశేషం.

ప్రపంచ క్రికెట్లో విలక్షణమైన శైలి కలిగిన స్పిన్నర్లలో సునీల్ నరైన్ ఒకడు. బంతి వేసే చేతిని వెనుక దాచిపెట్టుకుని పరుగెత్తుకుంటూ వచ్చి ఆశ్చర్యపరిచే బంతులతో బ్యాటర్లను బోల్తా కొట్టించడం నరైన్ కే చెల్లు. ఆ శైలిని అనుకరించడం కష్టమైన పని. కానీ దిల్లీ కుర్రాడు దిగ్వేశ్ సింగ్ రాఠి మాత్రం నరైన్ లాగే బౌలింగ్ చేయడంలో నైపుణ్యం సంపాదించాడు. అయితే కేవలం ఒకరి శైలిని అనుకరించినంత మాత్రాన విజయవంతం అవుతారనే గ్యారెంటీ ఉండదు. కానీ ఈ సీజన్లో నరైన్ కంటే ప్రమాదకరంగా తయారయ్యాడు దిగ్వేశ్. ప్రస్తుతం లఖ్ నవూ ప్రధాన బౌలింగ్ ఆయుధాల్లో దిగ్వేశ్ ఒకడు. పరుగులు కట్టడి చేయాలన్నా, వికెట్ పడగొట్టాలన్నా అతడి వైపే చూస్తున్నాడు రిషబ్ పంత్. పరుగుల వరద పారుతున్న ఈ ఐపీఎల్ సీజన్లో దిగ్వేశ్ ఎకానమీ రేటు 7.42 మాత్రమే. అతను 7 మ్యాచ్లో 9 వికెట్లు తీశాడు. దిల్లీ జట్టు ఈసారి నిలకడగా విజయాలు సాధిస్తూ సాగిపోవడానికి బౌలింగ్లో బలం ప్రధాన కారణం. ముఖ్యంగా స్పిన్ విభాగంలో ఆ జట్టుకు తిరుగులేదు. ఓవైపు కుల్దీప్ నిలకడగా వికెట్లు తీస్తూ ప్రత్యర్థులను దెబ్బ కొడుతుంటే.. అతడి కొత్త స్పిన్ భాగస్వామి కూడా చక్కటి ప్రదర్శన చేస్తున్నాడు. అతనే.. విప్రాజ్ నిగమ్. ఈ సీజన్ ముందు వరకు అభిమానులకు పరిచయం లేని ఈ పేరు.. దిల్లీ ఆడిన తొలి మ్యాచ్ లోనే మార్మోగింది. లఖ్ నవూతో తొలి మ్యాచ్ లోనే కీలకమైన మార్ క్రమ్ వికెట్ పడగొట్టడంతో పాటు భారీ లక్ష్య ఛేదనలో 39 పరుగుల మెరుపు ఇన్నింగ్స్తో విప్రాజ్ తన ఐపీఎల్ ఆగమనాన్ని ఘనంగా చాటాడు. తర్వాత బౌలింగ్ లో నిలకడగా రాణిస్తున్నాడు. సీజన్లో ఇప్పటిదాకా అతను 7 వికెట్లు పడగొట్టాడు. లోయరార్డర్ బ్యాటింగ్ లోనూ ఓ చేయి వేయగల విప్రాజ్ దిల్లీ కీలక ఆటగాళ్లలో ఒకడిగా మారాడు.

ప్రస్తుత ఐపీఎల్ లో భారత్ తరఫున అత్యధిక పరుగుల వీరుడు కోహ్లీనో, రాహులో, శుభ్ మనో కాదు.. సాయి సుదర్శన్. ఈ గుజరాత్ టైటాన్స్ ఓపెనర్ 6 మ్యాచ్ ల్లోనే 54.83 సగటుతో 329 పరుగులు సాధించాడు. అందులో నాలుగు అర్ధశతకాలున్నాయి. నికోలస్ పూరన్ (357) మాత్రమే అతడి కంటే ముందున్నాడు. గత సీజన్లోనే సుదర్శన్ తనదైన ముద్ర వేశాడు. ఈసారి ఈ తమిళనాడు కుర్రాడు ఇంకా గొప్పగా రాణిస్తున్నాడు. కెప్టెన్ శుభ్ మన్ గిల్ తో కలిసి టైటాన్స్కు అద్భుత ఆరంభాలనిస్తూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. గుజరాత్ 6 మ్యాచ్ ల్లో 4 గెలిచిందంటే అందులో సుదర్శన్ పాత్ర ఎంతో కీలకం. గత సీజన్లో సుదర్శన్ బాగా ఆడినా.. వేగం లేదనే విమర్శలు వచ్చాయి. కానీ ఈ సీజన్లో దూకుడు పెంచాడు. తన స్ట్రైక్ రేట్ 150కి పైనే ఉండడం విశేషం.

ఎక్కువగా దూకుడైన బ్యాటర్లే ఉన్న కోల్ కతా నైట్రైడర్స్ బ్యాటింగ్ లైనప్ లో.. కొంచెం కుదురుగా ఆడుతూ ఇన్నింగ్స్ను నడిపించే ఆటగాడు ఆంగ్ క్రిష్ రఘువంశీ. 2022 అండర్-19 ప్రపంచకప్ తో వెలుగులోకి వచ్చిన ఈ దిల్లీ కుర్రాడు.. ఈ తరం కుర్రాళ్లకు భిన్నమైన శైలిలో బ్యాటింగ్ చేస్తాడు. అడ్డదిడ్డంగా షాట్లు ఆడకుండా.. టెక్నిక్, టైమింగ్ ఉపయోగించి అందమైన షాట్లు కొడతాడు. వయసు తక్కువైనా అతడిలో ఎంతో పరిణతి కనిపిస్తుంది. ఎక్కువగా ఇంపాక్ట్ ప్లేయర్ గా ఆడుతున్న రఘువంశీ ఈ సీజన్లో 7 మ్యాచ్ లాడి 34 సగటుతో 170 పరుగులు చేశాడు. సన్ రైజర్స్తో మ్యాచ్ లో విలువైన అర్ధశతకంతో అతను జట్టును గెలిపించాడు. భవిష్యత్తులో టీమ్ఇండియాకు ఆడగల సత్తా ఉన్న కుర్రాడిగా రఘువంశీ గుర్తింపు తెచ్చుకున్నాడు.



## రెండు పరుగుల తేడాతో లఖ్‌నవూ విజయం



ఐపీఎల్ 18 సీజన్‌లో భాగంగా రాజస్థాన్ రాయల్స్తో జరిగిన మ్యాచ్‌లో 2 పరుగుల తేడాతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ విజయం సాధించింది. 181 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన రాజస్థాన్ 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 178 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ 74, రియాన్ పరాగ్ 39, వైభవ్ సూర్యవంశీ 34 పరుగులు చేశారు. లఖ్‌నవూ బౌలర్లలో అవేశ్ ఖాన్ 3, శార్దూల్ ఠాకూర్, మార్‌క్రమ్ చెరో వికెట్ తీశారు. తొలుత బ్యాటింగ్ చేసిన లఖ్‌నవూ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. ఓపెనర్ ఐడెన్ మార్ క్రమ్ (66; 45 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్ లు), మిడిల్ ఆర్డర్ బ్యాటర్ ఆయుష్ బదోని (50; 34 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలు బాదారు. ఇన్నింగ్స్ చివరి ఓవర్ లో అబ్దుల్ సమద్ (30*; 10 బంతుల్లో) నాలుగు సిక్స్ లు బాదడంతో స్కోరు 180కి చేరింది. మిచెల్ మార్ష్ (4), నికోలస్ పూరన్ (11), రిషభ్ పంత్ (3) విఫలమయ్యారు. ఈ క్రమంలో మార్ క్రమ్, బదోని జోడీ నాలుగో వికెట్కు 76 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. మార్క్రమ్ 31 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. 33 బంతుల్లో హాఫ్ సెంచరీ అందుకున్న బదోని.. తర్వాత బంతికే ఔటయ్యాడు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో వానిందు హసరంగ 2, జోఫ్రా ఆర్చర్, సందీప్ శర్మ, తుషార్ దేశ్ పాండే ఒక్కో వికెట్ పడగొట్టారు.



## గుజరాత్ టైటాన్స్‌కు ఐదో విజయం


ఐపీఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్ ఐదో విజయం అందుకుంది. సొంతగడ్డపై దిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన మ్యాచ్ లో గుజరాత్ 7 వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన డీసీ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. ఈ భారీ లక్ష్యాన్ని గుజరాత్ 19.2 ఓవర్లలో ఛేదించింది. వన్ డౌన్ బ్యాటర్ జోస్ బట్లర్ (97; 54 బంతుల్లో 48 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్స్ లు) త్రుటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. ఓపెనర్ సాయి సుదర్శన్ (36; 21 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడాడు.షెర్ఫాన్ రూథర్ ఫోర్డ్ (43; 33 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్ లు) రాణించాడు. ఏడు మ్యాచ్ ల్లో దిల్లీకిది ఇది రెండో ఓటమి.



## అబ్బాయిలకు పీరియడ్ పెయిన్ వస్తే అణు యుద్ధాలే

నెలసరి సమయంలో మహిళలు ఎదుర్కొనే బాధ వర్ణనాతీతం. శారీరకంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇక అప్పుడు వచ్చే మూడ్ స్వింగ్స్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అయితే, నెలసరిలో వచ్చే నొప్పిని చులకనగా చూస్తే అది మరింత బాధగా ఉంటుంది. ఇదే విషయాన్ని ప్రస్తావించారు నటి జాన్వీ కపూర్. తనకు కూడా పీరియడ్ మూడ్ స్వింగ్స్ ఉన్నాయన్నారు. ''నాకు పీరియడ్స్ సమయంలో విపరీతమైన మూడ్ స్వింగ్స్ వస్తాయి. నా మాట తీరుని బట్టి నేను పీరియడ్స్లో ఉన్నానని ఎదుటి వారికి అర్థం అయిపోతుంది. అందుకే నేను చిరాకుగా మాట్లాడగానే 'నీకు ఇది ఆ సమయమా' అని అడుగుతారు. అయితే ఈ ప్రశ్న అడిగే విధానమే ఒక్కోసారి బాధను కలిగిస్తుంది. కొందరు ఈ నెలసరి నొప్పి అనేది చాలా చిన్న విషయంగా పరిగణిస్తూ వ్యంగంగా మాట్లాడతారు. దీన్ని అర్థం చేసుకున్నవాళ్లు మాత్రం మనకు ప్రశాంతత కలిగేలా ప్రవర్తిస్తారు. విశ్రాంతి తీసుకోమని సలహాలిస్తారు'' ''పీరియడ్ పెయిన్ అనుభవించేవారికి మాత్రమే తెలుస్తుంది. ఆ సమయంలో మేం పడే బాధను, ఈ మానసిక స్థితిని అబ్బాయిలు ఒక్క నిమిషం కూడా భరించలేరని కచ్చితంగా చెప్పగలను. ఒకవేళ మగవాళ్లకు పీరియడ్స్ వస్తే ఆ నొప్పికి అణుయుద్ధాలే జరిగేవేమో..!'' అని జాన్వీ చెప్పారు. ఈ విషయం గురించి ఆమె ధైర్యంగా మాట్లాడారంటూ నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. దీనిపై బహిరంగ చర్చ అవసరమని కొందరు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ఇక ఇటీవల సమంతకూడా మహిళల నెలసరి సమస్యల గురించి మాట్లాడారు. ఇప్పటికీ కూడా కొందరు దీని గురించి బహిరంగంగా మాట్లాడాలంటే సిగ్గుపడుతున్నారని అన్నారు. అది పెద్ద తప్పు అన్నట్లు గుసగుసలాడుతుంటారని, ఈ ధోరణిలో మార్పు రావాలని కోరారు. ఇది మహిళల్లో జరిగే సహజ ప్రక్రియ అని తెలిపారు.

## పోలీసుల ముందుకు నటుడు 'షైన్ టామ్ చాకో'



మలయాళ ప్రముఖ నటుడు షైన్ టామ్ చాకో డ్రగ్స్ కేసులో పోలీసుల విచారణలో పాల్గొన్నాడు. కొద్దిరోజుల క్రితం కొచ్చిలోని ఓ హోటల్ లో డ్రగ్స్ వినియోగిస్తున్నారన్న సమాచారం రావడంతో పోలీసులు రైడ్ నిర్వహించారు. పోలీసుల రాకను గుర్తించిన షైన్ టామ్ చాకో అక్కడినుంచి పరారైనట్లు కొన్ని వీడియోలు వైరల్ అయ్యాయి. మూడో అంతస్తు నుంచి దూకి అక్కడి నుంచి ఆయన పారిపోయాడు. ఆ విజువల్స్ ఆధారంగా ఆయనకు నోటీసులు ఇచ్చారు.

తాజాగా పోలీసు విచారణకు తన న్యాయవాదితో హాజరయ్యారు. ఎర్నాకుళం నార్త్ పోలీస్ స్టేషన్ కు ఆయన వచ్చారు. విచారణ అనంతరం పోలీసులు అతడిని అరెస్టు చేశారు. కాగా షైన్ టామ్ చాకో డ్రగ్స్ తీసుకుంటారని గతంలోనే పలుమార్లు వార్తలు వచ్చాయి. రీసెంట్ గా మలయాళ చిత్ర పరిశ్రమకు చెందిన నటి విన్సీ సోనీ అలోషియస్ కూడా ఆయనపై పదునైన విమర్శలు చేసింది. సినిమా సెట్ లోనే ఆయన డ్రగ్స్ తీసుకున్నాడని చెప్పింది. ఆ సమయంలో తన పట్ల చాలా అభ్యంతరకరంగా ఆయన వ్యవహరించారని ఆమె చెప్పింది.

దసరా మూవీతో తెలుగులో క్రేజ్ తెచ్చుకున్న మలయాళ నటుడు షైన్ టామ్ చాకో. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో విలన్ గా ప్రేక్షకులను మెప్పించారు. గతేడాది విడుదలైన టాలీవుడ్ మూవీ దేవరలోనూ కీలక పాత్ర పోషించారు. ఇటీవల విడుదలైన అజిత్ కుమార్ గుడ్ బ్యాడ్ అగ్లీ చిత్రంలోనూ కనిపించారు. గతంలో ఓ డ్రగ్స్ కేసులో ఆయన నిర్దోషిగా బయటపడిన సంగతి తెలిసిందే. 2015లో అతనిపై నమోదైన కేసులో షైన్ టామ్ చాకో కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. గతంలో వీరంతా కొకైన్ సేవించారని పోలీసులు కేసు నమోదు చేశారు.

## పెళ్లిపై నాకు నమ్మకం లేదు..: త్రిష వ్యాఖ్యలు



నాలుగు పదుల వయసులోనూ వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు నటి త్రిష. అయితే, ఆమె వైవాహిక బంధంలోకి ఎప్పుడు అడుగు పెడుతుందా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆమె పెళ్లి గురించి ఇప్పటికే ఎన్నో వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఆమె వివాహంపై తన అభిప్రాయాన్ని బయటపెట్టారు. తనకు పెళ్లిపై సదుద్దేశం లేదని వ్యాఖ్యలు చేశారు. 'థగ్ లైఫ్' ప్రమోషన్స్ లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమెను.. 'మూడుముళ్ల బంధంపై మీ అభిప్రాయం ఏమిటి?' అని ప్రశ్నించగా.. ''నిజం చెప్పాలంటే నాకు వివాహంపై నమ్మకం లేదు. నాకు పెళ్లి అయినా ఓకే, కాకపోయినా ఫర్వాలేదు'' అని ఆమె బదులిచ్చారు. ఆమె ఇచ్చిన సమాధానంతో పక్కనే ఉన్న కమల్ హాసన్ షాకయ్యారు.త్రిష పెళ్లి గురించి కొంతకాలంగా వదంతులు వ్యాప్తి చెందుతోన్న విషయం తెలిసిందే. ఆమె ప్రేమలో ఉన్నారని త్వరలోనే పెళ్లి పీటలెక్కనున్నారని ఇటీవల ప్రచారం జరిగింది. ఆ వదంతులను ఆమె ఖండించారు. ''పెళ్లి ఎందుకు చేసుకోలేదు అంటే నా వద్ద సమాధానం లేదు. పెళ్లి ఎప్పుడు చేసుకుంటానో మాత్రం నాకే తెలియదు. నా మనసుకు నచ్చిన వ్యక్తి దొరికితే కచ్చితంగా చేసుకుంటాను. నన్ను పెళ్లి చేసుకోబోయేవాడు జీవితాంతం నాకు తోడు ఉంటాడనే నమ్మకం కలగాలి. అప్పుడే చేసుకుంటాను. పెళ్లి చేసుకొని విడాకులు తీసుకోవడం నాకు ఇష్టం లేదు. పెళ్లి చేసుకొని చాలామంది అసంతృప్తితో జీవిస్తున్నారు. అలాంటి పరిస్థితి నాకు ఎదురుకాకూడదు'' అని ఓ సందర్భంలో చెప్పారు.

'థగ్ లైఫ్' విషయానికి వస్తే.. మణిరత్నం - కమల్ హాసన్ కాంబినేషన్ లో రూపొందిన చిత్రమే ఇది. సుమారు 38 ఏళ్ల తర్వాత వీరిద్దరి కాంబోలో వస్తోన్న చిత్రమిది. శింబు, త్రిష కీలక పాత్రలు పోషించారు. శుక్రవారం ఈ సినిమా నుంచి పెళ్లి సాంగ్ ను చిత్రబృందం విడుదల చేసింది. ఇందులో చిత్రబృందం పాల్గొని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాన్ ఇండియా స్థాయిలో జూన్ 5న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానున్నట్లు చెప్పారు. ఇందులో పాల్గొన్న త్రిష.. ''థగ్ లైఫ్'లో అవకాశం వచ్చినందుకు సంతోషంగా భావిస్తున్నా. కమల్ హాసన్ లాంటి గొప్ప నటుడితో స్క్రీన్ పంచుకోవడం నా అదృష్టం'' అని తెలిపారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.